


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 66, పేజీలు - 08

శనివారం, ఆగష్టు 9, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## వరద నీరంతా మూసీలోకి చేరేలా

# ప్రణాళికలు సిద్ధం చేయండి

### - అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

- వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు చర్యలు చెప్పటాలి
- హైదరాబాద్‌లో రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదు
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలన్నా సీఎం రేవంత్
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ప్రాంతంలో వరద సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం రోజున సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో వర్షాల కారణంగా చోటుచేసుకుంటున్న వరద సమస్యలపై చర్చించారు. సంబంధిత శాఖల అధికారుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. అలాగే గురువారం సాయంత్రం నగరంలో కురిసిన వర్షాల కారణంగా తలెత్తిన పరిస్థితులపై ఆరా తీశారు. నగరంలో వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండటం వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందన్న అధికారులు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ప్రాంతంలో వరద సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి శాశ్వత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షపు నీటిని మూసీ నదిలోకి మళ్లించడానికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అన్ని చెరువులు, నాలాలు, కాలువలు, ఇతర నీటి మార్గాలను మూసీకి క్రమపద్ధతిలో అనుసంధానించాలని ఆయన ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల వెడల్పు త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి,

2లో..

## ఈసీకి రాహుల్ సవాల్

- బిహార్ ఓటర్ల జాబితా సవరణతో రేగిన వివాదం
- ఎన్నికల కమిషన్ తీరుపై సర్వత్రా విమర్శలు
- బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆరోపణ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర ఎన్నికల కమిషన్‌పై వరుస ఆరోపణలు చేస్తోన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. మరోసారి ఈసీపై విరుచుకుపడ్డారు. ఈసీకి తాజాగా ఆయన ఐదు ప్రశ్నలు సంధించారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు బహిర్గతం చేయడం లేదని, పోలింగ్ బూతుల్లో సీసీటీవీ కెమెరా రికార్డులను ఎందుకు తొలిగిస్తున్నారని నిలదీశారు. నకిలీ ఓటర్ల రిజిస్ట్రేషన్‌ను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని, ప్రతిపక్షాలను ఎన్నికల కమిషన్ భయపెడుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీకి ఏజెంట్‌గా ఎన్నికల సంఘం మారిపోయిందా? అని రాహుల్ ప్రశ్నించారు. తమ ప్రశ్నలకు బుదులివ్వాలని భారత ప్రజాస్వామ్యం ఎంతో

2లో..

## ట్యాపింగ్ కేసు నిందితులకు

# ఉరి శిక్ష విధించినా తప్పు లేదు



### - బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

- ట్యాపింగ్ ద్వారా వేల కోట్లు దోచుకున్నారంటూ బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు
- కేసీఆర్‌తో సీఎం రేవంత్ రెడ్డికి లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శ
- సిట్ విచారణపై అనుమానాలు, కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా వాంగ్మూలం నమోదు చేసిన బండి సంజయ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణ రాజకీయాలను తీవ్రంగా కుదిపేస్తోంది. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భారీ ఎత్తున ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తీవ్ర ఆరోపణలు రాగా ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేసి దర్యాప్తు చేయిస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. ఇక సాక్షులు,

2లో..

## కూటమి నేతలంతా కలిసి పులివెందులను గెలుచుకురండి



### 40 మంది కూటమి నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను ఇటు అధికారంలోని కూటమి పార్టీలు, అటు వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవి భార్య మారెడ్డి లతారెడ్డి, వైసీపీ అభ్యర్థిగా తుమ్మల హేమంత్ రెడ్డి ఎన్నికల బరిలోకి దిగారు. ఇరు పక్షాలకు చెందిన కీలక నేతలు పులివెందులలో మకాం వేసి హెూరాహెూరీగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి నేతలకు కీలక సూచన చేశారు. కూటమి నేతలంతా కలిసి ఒక సంకల్పంతో పులివెందుల జడ్పీటీసీని గెలుచుకురావాలని చెప్పారు. పులివెందుల అభివృద్ధిపై తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి కూటమికి చెందిన 40 మంది నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేరకు నేతలకు సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి, బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. గత టీడీపీ హయాంలోనే పులివెందులకు కృష్ణా జలాలు అందించి పంటలను కాపాడామని చంద్రబాబు తెలిపారు. ఇప్పుడు పులివెందుల జడ్పీటీసీని గెలుచుకురావాలని జగన్ కూడా చేయని విధంగా పులివెందులను అభివృద్ధి చేద్దామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న

2లో..

## పుతిన్‌కు ప్రధాని మోదీ ఫోన్

- అమెరికా ఆంక్షల నేపథ్యంలో చర్చలకు ప్రాధాన్యం
- ఉక్రెయిన్ సంక్షోభంపై చర్చించిన ఇరువురు నేతలు
- శాంతియుత చర్చలే పరిష్కారమని భారత్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీతో ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం గురించి చర్చించారు. ద్వైపాక్షిక సహకార పురోగతిని సమీక్షించారు. పీఐబీ అధికారిక ప్రకటన ప్రకారం, అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీకి ఉక్రెయిన్‌కు సంబంధించిన తాజా పరిణామాలను

2లో..

## వైసీపీకి, వైఎస్సార్‌కు ఏం సంబంధం

### పేరు పెడితే వారిదే పేటెంట్ రైటా?

- నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించారన్న షర్మిల
- వైఎస్ఆర్ వైసీపీ సొంతం కాదని స్పష్టీకరణ
- కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అని విమర్శలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో కూటమి సర్కార్ పై పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల నిప్పులు చెరిగారు. వైఎస్సార్సీపీపై కోపాన్ని తన తండ్రి వైఎస్ పై చూపిస్తారా అంటూ కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వైఎస్ విగ్రహాన్ని కూల్చివేసిన ఘటనపై షర్మిల తీవ్రంగా స్పందించారు. వైఎస్ కూ, వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని షర్మిల తేల్చేశారు. ఈ సందర్భంగా వైఎస్ గొప్పతనాన్ని షర్మిల చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వానికి వైసీపీపై కోపాన్ని వైఎస్సార్ విగ్రహాల మీద చూపిస్తారా అని షర్మిల ప్రశ్నించారు. అసలు వైసీపీకీ వైఎస్సార్ కీ ఏం సంబంధమని అడిగారు.

2లో..

## 48 గంటల టైమిస్తున్నా

# సారీ చెప్పు

### - బండి సంజయ్‌కు కేటీఆర్ సవాల్

- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై బండి సంజయ్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- త్వరలోనే లీగల్ నోటీసులు పంపుతామని వెల్లడి
- బండికి కనీస పరిజ్ఞానం కూడా లేదంటూ ఘాటు విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్..కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు లీగల్ నోటీసులు పంపించారు. 48 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నా ఇంటెలిజెన్స్ పనితీరు గురించి అవగాహన లేదని బండి సంజయ్ పై కేటీఆర్ మండిపడ్డారు. కనీస జ్ఞానం కూడా లేదన్నారు.

2లో..

## ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

# బీజేపీలోకి వస్తారు

### - బిగ్ బాంబ్ పేల్చిన రాంచందర్ రావు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు బీజేపీలో చేరుతారని ఊహాగానాలు వినిపిస్తున్న సమయంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ఓ టీవీ చానల్ తో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలోకి వచ్చేందుకు ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారని వారు తనతో టచ్‌లో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ నాయకత్వపై ఆ పార్టీ నేతలు పూర్తిగా నమ్మకం కోల్పోయారని అందుకే బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ కు రాజీనామా చేసిన నాగర్ కర్నూలు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రామచంద్రరావుతో సమావేశం అయ్యారు. పదో తేదీన ఆయన బీజేపీలో చేరనున్నారు.

2లో..

## డబుల్ బెడ్ రూమ్

# ఇండ్ల పేరుతో దోపిడీ

### - కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందన్న పొంగులేటి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పేదలకు ఆరేళ్లకు పైగా డబుల్ బెడ్ ఇండ్ల ఆశలు చూపి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరి వద్ద అక్రమ వసూళ్లు చేసి పేదలను దోచుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రెండు ఎన్నికల్లో ఇవే ఇండ్లను చూపిస్తూ ఎవరికీ ఇవ్వలేదని, మూడోసారి కూడా మోసం చేయడానికి గత ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు తగు రీతిలో బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. వరంగల్ జిల్లా హనుమకొండ బాల సముద్రం ప్రాంతంలో

2లో..

## జాతీయ విద్యా విధానానికి స్వస్తి

### - ద్విభాషా విధానాన్ని ప్రకటించిన స్టాలిన్



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం (ఎస్ఈపీ)ను ప్రకటించారు. ఈ విధానం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020)కు ప్రత్యామ్నాయంగా రూపొందించారు. తమిళనాడు ప్రత్యేక సాంస్కృతిక, విద్యా అవసరాలకు అనుగుణంగా

2లో..

# ట్యాపింగ్ కేసు నిందితులకు ఉరి శిక్ష విధించినా తప్పు లేదు

వారి వాంగ్మూలాలను కూడా రికార్డ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కేంద్రమంత్రి బండి సంజయ్ దిల్ ఖుష్ భవన్‌లో సిట్ విచారణకు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి కీలక ఆధారాలను బండి సంజయ్ సిట్ అధికారులకు అందించారు.దాదాపు రెండున్నర గంటల పాటు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వివరించినట్లు బయటికి వచ్చిన తర్వాత వెల్లడించారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ అధికారులుగా ఉన్న రాధాకిషన్ రావు, ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని అందుకు వారికి ఉరిశిక్ష విధించాలని బండి సంజయ్ సంచలన డిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిందితులకు కాపాడే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కేసును ఇంకా సాగదీస్తున్నారని అన్నారు. కమిషన్లు, కమిటీలు వేసి నివేదికలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోకుండా సైలెంట్ అయిపోతారని బండి సంజయ్ మండిపడ్డారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యధికంగా తన ఫోన్లనే ట్యాప్ చేశారని బండి సంజయ్ విమర్శించారు. మావోయిస్టుల పేర్లతో తమపై ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. ఇక ఫోన్ ట్యాప్ అయిన వారి లిస్ట్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు అప్పటి మంత్రి తన్నీరు హరీష్ రావులు కూడా ఉన్నారని వెల్లడించారు. ఈ కేసులో సిట్ అధికారులు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వివరాలు చూసి తాను ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని తాను అప్పుడే చెప్పినట్లు బండి సంజయ్ గుర్తు చేసుకున్నారు. వావి వరుసలు లేకుండా భార్యాభర్తల ఫోన్లు ట్యాప్ చేశారని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చివరికి తన ఇంట్లో పనిచేసే వాళ్ల ఫోన్లను కూడా ట్యాప్ చేయడం దారుణమని ఆరోపించారు. కేసీఆర్ తన కన్నకూతురు కల్వకుంట్ల కవిత ఫోన్లను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. తాను బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తన చుట్టూ గట్టి నిఘా పెట్టినట్లు సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో చివరికి సామాన్యులు కూడా ఫోన్లు మాట్లాడలేకపోయారని మండిపడ్డారు. ఇక టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ సమయంలో ఆ కేసుపై విచారణ జరుపుతున్న జడ్జి ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని బండి సంజయ్ ఆరోపించారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలను సిట్ విచారణకు హాజరైన బండి సంజయ్ అధికారులకు అందించారు. 317 జీవో రద్దు కోసం తాను తయారు చేసుకున్న ఉద్యమ కార్యచరణ లీకైనట్లు అందులో తెలిపారు. అందుకే తనను ముందుగానే అరెస్ట్ చేసేందుకు కరీంనగర్ పోలీసులు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. తాను చేసిన ప్రజా సంగ్రామ యాత్రలో ఎవరెవరిని ఎక్కడెక్కడ కలవబోతున్నారనే సమాచారాన్ని కూడా తెలుసుకున్నారని చెప్పారు. ఆ తర్వాత వారిని తాను కలవకుండా చేశారని ఆరోపిస్తూ వాటికి ఆధారాలను అధికారులకు సమర్పించారు. గ్రూప్-1 అభ్యర్థుల తరఫున తాను పోరాటం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్న క్రమంలోనూ తన ఫోన్ ట్యాప్ చేసినట్లు చెప్పారు.తమ పార్టీ కార్యక్రమాలు చేసేందుకు అనుమతులు పొందేందుకు హైకోర్టుకు వెళ్లినప్పుడు కూడా జడ్జిల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులకు బండి సంజయ్ తెలిపారు. పలు కేసుల్లో తన బెయిల్ పిటిషన్లను విచారణ జరిపిన జడ్జిల ఫోన్లను ట్యాప్ చేసినట్లు సేకరించిన ఆధారాలను ఇచ్చారు. వీటన్నింటికీ సంబంధించిన ఆధారాలను హార్డ్ కాపీలతోపాటు సాఫ్ట్ కాపీలను కూడా బండి సంజయ్ సిట్ అధికారులకు అప్పగించారు. మాజీ పోలీస్ ఉన్నతాధికారులు, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారుల నుంచి ఈ ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించిన బండి సంజయ్ సిట్‌కు సమర్పించారు. కొన్ని ఆడియో రికార్డులను కూడా పెన్‌డ్రైవ్‌లో సిట్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ విచారణపై తమకు నమ్మకం లేదన్న బండి సంజయ్ దీన్ని సీబీఐ విచారణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వరద నీరంతా మూసీలోకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయండి

నాలాల్లోకి, అటునుంచి మూసీలోకి చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే మూసీ నదిని పునరుద్ధరించడం చాలా కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. భారీ వర్షాల సమయంలో నగరంలో వరదలను, ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో మూసీ పునరుద్ధరణ సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ దిశలో హైదరాబాద్ కోసం సమగ్ర పట్టణాభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ఈసీకి రాహుల్ సవాల్

విలువైందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాపై మరోసారి విరుచుకుపడ్డారు.ఆగస్టు 7న మీడియా సమావేశంలో ఈసీపై ఆరోపణలు చేస్తూ రాహుల్ గాంధీ ప్రజంటేషన్ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరించిందని, పలు రాష్ట్రాల ఎన్నికల్లోనూ నకిలీ ఓటర్లతో బీజేపీకి లబ్ధి చేకూర్చిందని రాహుల్ గాంధీ ఆరోపణలు చేయడం గమనార్హం. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయంటూ పలు నివేదికలను రాహుల్ చూపించారు. దీనిపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించింది. ఏదైనా ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని, ఇంతవరకు రాహుల్ గాంధీ నుంచి అలాంటి ఫిర్యాదు తమకు ఏదీ అందలేదని పేర్కొంది.రాజ్యాంగ విలువలను దెబ్బతీయడం, సంవిధానంపై దాడి చేసేటప్పుడు ఈసీ అధికారులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన వారిని పట్టుకోవడానికి టైమ్ పట్టినా ఎప్పటికైనా దొంగలు దొరక్కపోరని, వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని రాహుల్ స్పష్టం చేశారు. అంతేకాదు, తన ఆరోపణలపై ప్రమాణం చేయాలని ఈసీ డిమాండ్‌ను తోసిపుచ్చారరు. తాను ఇప్పటికే పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగంపై ఎంపీగా ప్రమాణం చేశానని ఆయన గుర్తుచేశారు.మరోవైపు, రాహుల్ గాంధీ ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలంటూ ఈసీ సవాల్ చేయడాన్ని వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మండిపడ్డారు. మహారాష్ట్ర, హర్యానా సహా పలు రాష్ట్రాల ఎన్నికల సమయంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపించిన వెంటనే స్పందించిన దర్యాప్తు చేయడం మానేసి రాహుల్ గాంధీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దబాయిస్తుందని దుయ్యబట్టారు. అసలు దర్యాప్తే చేపట్టకపోతే ఆయన వాదనలు తప్పని ఎలా తెలుస్తుందని ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించారు. తాము సమర్పించిన సాక్ష్యాలు ఈసీ ఎదుటే ఉన్నాయని వాటిని పరిణగణలోకి తీసుకొని దర్యాప్తు చేయాలని ప్రియాంక డిమాండ్ చేశారు. తమ ఆందోళన కేవలం ఒక పార్టీ గురించి మాత్రమే కాదని భారత ప్రజాస్వామ్య వ్యవస్థ గురించని ఆమె వ్యాఖ్యానించారు.

# పుతిన్‌కు ప్రధాని మోదీ ఫోన్

తెలియజేశారు. అనంతరం, ప్రధాని మోదీ పుతిన్‌కు చేసిన వివరణాత్మక అంచనాకు ధన్యవాదాలు తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ పోరాటానికి శాంతియుత పరిష్కారం కోసం భారతదేశ స్థిరమైన వైఖరిని పునరుద్ఘాటించారు. అదే సమయంలో, ఇరువురు నాయకులు భారతదేశం-రష్యా సంబంధాలు, ద్వైపాక్షిక ఎజెండాలో సాధించిన పురోగతిని సమీక్షించారు. రెండు దేశాల మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఈ సంవత్సరం చివరిలో జరగనున్న భారతదేశం-రష్యా వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానించారు. రష్యా అధ్యక్షుడు భారతదేశ పర్యటన పూర్తైన తర్వాత, రెండు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారాన్ని పెంచడానికి ఒక కొత్త వేగాన్ని అందించే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారంనాడు భారతదేశంపై 50 శాతం రెట్టింపు సుంకాలు విధిస్తామని ప్రకటించారు. ఈ టైంలోనే ప్రధాని నరేంద్ర మోదీ - రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఈ చర్చలు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యాతో వాణిజ్య భాగస్వామ్యాన్ని కొనసాగించడం, తక్కువ ధరలకు ముడి చమురును దిగుమతి చేసుకోవడంపై భారతదేశంపై 50 శాతం అదనపు సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. అయితే, గత వారంలో ట్రంప్ భారతదేశంపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు, కాని రెండు రోజుల క్రితం బుధవారం (ఆగస్టు 6) నాడు ట్రంప్ ఈ అమెరికా రెసిప్రోకల్ సుంకాన్ని రెట్టింపు చేస్తూ భారతదేశంపై మరో 25 సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు.

## కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారికి

# కలెక్టర్ షోకాజ్ నోటీసులు

తుంగతుర్తి, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి కల్పనకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధులపట్ల నిర్లక్ష్యం, రికార్డుల సక్రమ నిర్వహణ లేకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నారు. పాఠశాల నిర్వహణలో లోపాలు శాఖాపరంగా చర్యలకు దారితీశాయి.

# వైసీపీకి, వైఎస్సార్‌కు ఏం సంబంధం

మహానేత పేరు పెట్టినంత మాత్రాన వైఎస్సార్ ఏమైనా వారి సొత్తా, లేక పేటెంట్ రైటా అని నిలదీశారు. వైఎస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అన్నారు. చివరి క్షణం దాకా తన జీవితాన్ని ప్రజల కోసమే త్యాగం చేసిన ప్రజా నాయకుడన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో ఆయనది చెరగని ముద్ర అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఈ దేశానికి దిశా నిర్దేశం వైఎస్సార్ అని, ప్రజాక్షేమమే పరమావధిగా చివరి దాకా పరితపించిన గొప్ప వ్యక్తి అని షర్మిల తెలిపారు. ఇంతటి ప్రజాభిమానం కలిగిన నాయకుడికి నీచ రాజకీయాలు చేసే వారితో కలిపి ఆపాదిస్తారా అని ప్రశ్నించారు. ఆయన విగ్రహాల మీద కక్ష రాజకీయాలు చేస్తారా అని అడిగారు. ఇదెక్కడి దిక్కుమాలిన చర్య అన్నారు. నందిగామ గాంధీ సెంటర్ లో వైఎస్ విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమన్నారు. ఈ చర్యను కాంగ్రెస్ ఖండిస్తోందన్నారు. ఇది కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని షర్మిల ఆరోపించారు.

ఉమ్మడి రాష్ట్రంలో మహానేత మరణం తర్వాత గాంధీ సెంటర్ వద్ద నాటి ప్రభుత్వం అక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, విగ్రహం చుట్టూ వైసీపీ అక్రమంగా వేసుకున్న సెట్టింగులు తొలగించుకోవాలని, దానికి తమకేం అభ్యంతరం లేదని క్లారిటీ ఇచ్చారు. కానీ ఇదే సాకుగా చూపి వైఎస్ విగ్రహాల మీద చేయి వేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కాబట్టి తొలగించిన చోట వెంటనే రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం తప్పదని తీవ్రంగా హెచ్చరించారు.

# కూటమి నేతలంతా కలిసి పులివెందులను గెలుచుకురండి

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

**- హోరా హోరీ**

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 12న ఎన్నిక జరగనుంది. ఈ సారి ఉప ఎన్నిక హైప్ క్రియేట్ చేస్తోంది. టీడీపీ, వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని నువ్వా, నేనా అంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. రెండు పార్టీలకు చెందిన ముఖ్యనేతలంతా ఇక్కడే తిష్ఠ వేశారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఊహించని విధంగా జిల్లాలో దెబ్బ తింది. షర్మిల అంశం కూడా ప్రభావం చూపింది. కాగా, ఇప్పుడు జెడ్పీటీసీ బై పోల్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ సీఎం జగన్ సొంత నియోజకవర్గం కావటంతో గెలుపే లక్ష్యంగా టీడీపీ నేతలు వ్యూహాలను అమలు చేస్తున్నారు. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు.

**- మారుతున్న లెక్కలు**

ఈ బైపోల్ లో 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పులివెందుల జడ్పీటీసీకి ఆరు గ్రామ పంచాయతీల పరిధిలో 10,400 ఓట్లు ఉన్నాయి. వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు.గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి 2,166 ఓట్లు పోలయ్యాయి. వైసీపీకి 5,955 ఓట్లు వచ్చాయి. వైసీపీ నుంచి ఎంపీ అవినాశ్‌రెడ్డి వైసీపీ గెలుపు బాధ్యతలను భుజస్కంధాలపై వేసుకున్నారు. అదే సమయంలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఇతర టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు. ఇక్కడ గెలుపు కోసం రెండు పార్టీలు కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నాయి. గెలుపు మాత్రం ఏకపక్షం గా లేదనేది స్పష్టం అవుతోంది.

**- గెలుపెవరిది**

పులివెందులతో పాటుగా ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు టీడీపీ, వైసీపీ నువ్వా నేనా అంటూ ముందుకు పోతున్నాయి. టీడీపీ నుంచి అద్దలూరు ముద్దుక్రిష్ణారెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ వైసీపీ తమ అభ్యర్థిని ముందుగానే ఖరారు చేసింది. దీంతో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వైసీపీ నేతలు ఒక విడత ఇంటింటి ప్రచారాన్ని పూర్తిచేశారు. ఇక్కడ మొత్తం 24,606 ఓట్లు ఉన్నాయి. 13 గ్రామ పంచాయతీలున్నాయి. బీసీ ఓటర్లు అధికంగా ఉన్నారు. వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రచార బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు స్థానాల్లో ఇప్పటికీ గెలుపు ఎవరనేది ఇప్పటికీ అంతు చిక్కటం లేదు. దీంతో చివరి నిమిషం వరకు రెండు పార్టీలు శక్తి మేర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఫలితం ఎవరికి అనుకూలంగా ఉంటుందనే ఉత్కంఠ పెరుగుతోంది.

# 48 గంటల టైమిస్తున్నా సారీ చెప్పు

బండి సంజయ్ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను నీచమైనవని వాటిని రుజువు చేయాలని సవాల్ విసిరారు. కేటీఆర్ బండి సంజయ్‌కు 48 గంటల్లోగా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని లీగల్ నోటీసు జారీ చేస్తున్నట్లు ప్రకటించారు.బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని కేసులు నమోదు చేసి విచారణ జరుగుతున్న స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఎదుట కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి , కరీంనగర్ ఎంపీ అయిన బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా సిట్ ముందు హాజరయ్యారు. ఆయన తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యులు, సిబ్బంది ఫోన్లు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్యాప్ చేశారని ఆరోపించారు. బండి సంజయ్ ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)కి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆయన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులను రక్షిస్తున్నారని, సిట్ విచారణపై తనకు నమ్మకం లేదని పేర్కొన్నారు. బండి సంజయ్ తన ఫోన్‌ను మావోయిస్ట్ కార్యకలాపాల పేరుతో ట్యాప్ చేసినట్లు ఆరోపించారు.

అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కల్వకుంట్ల కవిత, వారి భర్తల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లుగా పేర్కొన్నారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్), కేటీఆర్, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఈ ట్యాపింగ్ వెనుక ఉన్నారని ఆరోపించారు.ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహంతో ఉన్నారు. రాజకీయంగా ప్రాధాన్యత కోసం చీప్ డ్రామా చేస్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. మంత్రిగా బాధ్యతాయుతంగా పని చేయడం ఢిల్లీ బాస్‌ల చెప్పులు మోసేంత సులభం కాదని ఎద్దేవా చేశారు. జూన్‌లో కేటీఆర్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై లీగల్ నోటీసు జారీ చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆరోపణలను "నాటకాల కోసం" ఉపయోగిస్తోందని ఆరోపించారు. ఈ నోటీసులపై బండి సంజయ్ ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

## ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

# బీజేపీలోకి వస్తారు

ఆయనతో పాటు మరికొంత మంది కీలక నేతలు కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలు ఆసక్తి రేపుతున్నాయి. ఐదుగురే కాదని మరికొంత మంది నేతలు కూడా తమ పార్టీ వైపు చూసే అవకాశం ఉందని అంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా చర్యలు తీసుకోవడంలేదన్నారు. సీబీఐకి ఇస్తే అసలు విషయం అంతా బయటకు వస్తుందని స్పష్టం చేశారు.బీజేపీలో విలీనం కోసం బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఇటీవలి కాలంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో కవిత కూడా ఆరోపించారు. అలాంటి ఆలోచనలకు వ్యతిరేకంగానే ఆమె సొంత రాజకీయం చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇటీవల సీఎం రమేష్ కూడా అవే ఆరోపణలు చేశారు. కేటీఆర్ స్వయంగా తన వద్దకు వచ్చారని తాను విలీనం అంశాన్ని బీజేపీ పెద్దలతో మాట్లాడానన్నారు. కానీ ఆ పార్టీని విలీనం చేసుకోవడానికి బీజేపీ పెద్దలు ఆసక్తిగా లేరన్న విషయం స్పష్టమయిదంని అదే విషయం చెప్పానన్నారు.

ఈ మాటల్ని బీఆర్ఎస్ నేతలు ఖండించలేదు. కానీ కేటీఆర్ మాత్రం తెలంగాణ ఉన్నంత వరకూ బీఆర్ఎస్ ఉంటుందని ఏ పార్టీలో విలీనం చేయబోమంటున్నారు. బీజేపీతో చర్చలు జరిపారా లేదా అన్నది మాత్రం క్లారిటీగా చెప్పడంలేదు.దీంతో బీజేపీతో పొత్తు లేదా విలీనం ఉంటుందన్న ప్రచారం ఊపందుకోవడంతో.. ముందుగానే బీజేపీలో చేరితే బాగుంటుంది కదా అని అనుకునే బీఆర్ఎస్ నేతల సంఖ్య పెరిగిందని భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని రామచంద్రరావు ప్రకటించడం హాట్ టాపిక్ అయింది. ఇటీవల కాంగ్రెస్ బహిష్కృత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న త్వరలో బీఆర్ఎస్ ఎల్పీ బీజేపీలో విలీనం అవుతుదని జోస్యం చెప్పారు.

రామచంద్రరావు ప్రకటన చూస్తూంటే అలాంటి సూచనలు ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరో వైపు భారత రాష్ట్ర సమితి ఇప్పుడు ఇబ్బందుల్లో ఉంది కాబట్టి మైండ్ గేమ్ ఆడుతున్నారని ఆ పార్టీ వర్గాలంటున్నారు. తమ పార్టీ నుంచి ఎవరు ఇతర పార్టీలో చేరినా అనర్హతా వేటు పడుతందని అందుకే కాంగ్రెస్ లో చేరిన వారు కూడా తాము పార్టీ మారామని చెప్పుకోలేకపోతున్నారని అంటున్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో దోపిడీ

శుక్రవారం నాడు 592 మంది లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేసి మంత్రి పొంగులేటి దగ్గరుండి మరీ గృహ ప్రవేశాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేంద్రర్ రెడ్డి, నాగారాజు, మేయర్ గుండు సుధారాణి తదితరుల పాల్గొన్నారు.

**- పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపిక**

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ఎంతో పారదర్శకంగా జరిగింది అని హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్టీలకు అతీతంగా పార్టీలకు అతీతంగా ఎంతో పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరిగినట్లు చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు , కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయని ఆరోపించారు. గతంలో కట్టిన ఈ ఇండ్లను ఎందరో పేదలకు చూపించి అడ్డగోలుగా బి ఆర్ ఎస్ నేతలు వసూళ్లు చేసి ఎవరికీ ఒక్క ఇంటిని ఇవ్వలేదని ఆరోపించారు. అంతేగాక ఈ ఇండ్ల ఆశను చూపి ప్రతిసారి ఎన్నికల్లో లబ్ధిపొందారని అయితే మూడో సారి వారి మోసాన్ని గమనించి పేదలు తగు బుద్ధి చెప్పారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

**- 6 లక్షలకుపైగా రేషన్ కార్డులు మంజూరు**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకే గాక పట్టణ పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ శ్రావణ మాస శు క్రవారం నాడు 592 మంది గృహ ప్రవేశాలు చేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ ఇండ్లు మహిళల పేరిటే మంజూరు చేశామని, ఒక రోజు ముందుగాను 592 మంది అక్కచెల్లెళ్లకు రాఖీ పౌర్ణమి కానుక అందినట్లయిందని మంత్రి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ ప్రభుత్వం పేదల పక్షపాతిగా సంక్షేమం - అభివృద్ధి ప్రాతిపదికన ముందుకు సాగుతోందన్నారు. తాజాగా ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులు మంజూరు చేయడం , ఇప్పటికే దశల వారీగా ఆరు హామీలను అమలు చేస్తున్న విషయం గమనించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు.

**- కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్**

తెలంగాణ ప్రజలకు వెన్నుపోటు పొడిచేలా కాళేశ్వరం ప్రాజెక్టులో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తికి పాల్పడిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. వారి అవినీతి వల్లే కాళేశ్వరం కూలిందన్నారు. వేల కోట్ల రూపాయిలు కేసీఆర్ కుటుంబానికి చేరాయన్నారు. దోచుకున్నది దాచుకోవడానికే బి ఆర్ ఎస్ నాయకులు తిరిగి అధికార ప్రభుత్వంపై దాడికి దిగుతున్నారని విమర్శించారు. కాగా దేశంలో బిసీ కులగణన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని ,42 శాతం బీసీ కోటా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# జాతీయ విద్యా విధానానికి స్వస్తి

రూపొందించుకున్నామని స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళనాడు పాఠశాలల్లో తమిళం , ఇంగ్లీష్ రెండు భాషలను మాత్రమే నేర్పిస్తారు. ఈ ద్విభాషా విధానాన్ని రాష్ట్రం అనుసరిస్తుందని స్టాలిన్ స్పష్టం చేశారు. కేంద్రం ప్రకటించిన ఎన్ఈపీలో మూడు భాషల ఫార్ములాను తమిళనాడు తిరస్కరించింది. మూడో భాషగా హిందీ ఉంది. అయితే హిందీని నేర్పించే ప్రశ్నే లేదని తమిళనాడు ప్రభుత్వంస్పష్టం చేసింది. తమిళ భాషను సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాలు సహా అన్ని బోర్డులలో తప్పనిసరి చేస్తూ తమిళ లెర్నింగ్ యాక్ట్‌ను అమలు చేస్తామని స్టాలిన్ ప్రకటించారు.రాష్ట్ర విద్యా విధానం సైన్స్, ఇంగ్లీష్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక రంగాలపై దృష్టి సారిస్తుందని సీఎం తెలిపారు. విధానం విద్యార్థులను గ్లోబల్ అవకాశాలకు సిద్ధం చేయడం, సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి 11వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేస్తూ ఎన్ఈపీలో నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. అంటే ఇంటర్ ఫస్టియర్ కుపబ్లిక్ ఎగ్జామ్స్ ఉండవన్నమాట. ఆర్ట్స్ , సైన్స్ కోర్సుల కోసం అండర్ గ్రాడ్యుయేట్ (యూజి) అడ్మిషన్లు 11వ, 12వ తరగతుల మొత్తం మార్కుల ఆధారంగా జరుగుతాయని స్టాలినెతెలిపారు. ఎన్ఈపీలో ప్రతిపాదించిన సాధారణ ప్రవేశ పరీక్షలను తిరస్కరించారు. అలాగే ఎన్ఈపీలో ప్రతిపాదించిన 3, 5, 8 తరగతులలో పబ్లిక్ పరీక్షలను ఎస్ఈపీ తిరస్కరించింది. ఈ పరీక్షలు విద్యార్థుల డ్రాపౌట్ రేటును పెంచుతాయని, విద్య వాణిజ్యీకరణకు దారితీస్తాయని స్టాలిన్ పేర్కొన్నారు. 2025లో 12వ తరగతి ఉత్తీర్ణులైన 75 శాతం మంది విద్యార్థులు ఉన్నత విద్యలో చేరారని, రాబోయే సంవత్సరాల్లో దీనిని వంద శాతానికి చేర్చాలని స్టాలిన్ లక్ష్యంగా పేర్కొన్నారు. 2022లో రిటైర్డ్ జస్టిస్ డి. మురుగేసన్ నేతృత్వంలో 14 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ 2024 జూలైలో తమ నివేదికను స్టాలిన్‌కు సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా ప్రస్తుత రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రకటించారు.

# నీకు నేను రక్షా నాకు నువ్ రక్ష మనిద్దరం దేశానికి రక్షా ధర్మానికి రక్షా



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రక్షబంధన్ ఉత్సవం లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని శ్రీ చైతన్య స్కూల్ లో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ నీకు నేను రక్షా నాకు నువ్ రక్ష మనిద్దరం దేశానికి రక్షా ధర్మానికి రక్షా అని అన్నారు.కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి మార్పు దయాకర్ రెడ్డి, ప్రశాంత్, నవీన్, వినయ్ రెడ్డి, చందు, నిమ్మల సాయి, రమేష్ మాచర్ల, రాకేష్ యాదవ్, ప్రశాంత్, కార్యక్రమంలో పాల్గొనటం జరిగింది.

# పండుగ సాయన్న జయంతి.. ఘనంగా నివాళులు



శేరిలింగంపల్లి( ప్రశ్న న్యూస్ )తెలంగాణ సుపుత్రుడు, నిరంకుశ పాలనను ఎదిరించిన బహుజన యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని శుక్రవారం రాయదుర్గంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ వేడుకలను గ్రేటర్ హైదరాబాద్ బీసీ యువగళం అధ్యక్షుడు నీరుడి కిరణ్ ముదిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ "స్వాతంత్ర సమరయోధుల చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉంది. నిజాం దమన విధానాలను ఎదిరించి, సామాన్యుల హక్కుల కోసం పోరాడిన ఆయన్ను ప్రజలు తెలంగాణ రాబిన్ హుడ్‌గా గుర్తుంచుకుంటారు" అని తెలిపారు. "తనదైన శైలిలో స్వయం పాలనను ఏర్పాటు చేసి, బహుజన రాజ్యాన్ని స్వప్నంగా మలిచిన సాయన్న మార్గం యువతకు ఆదర్శంగా నిలవాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘానికి చెందిన నేతలు సడల నరేందర్, నీలం నరేందర్, నీలం సురేందర్, నరిగెల ప్రభాకర్, గనుగు దయాకర్, నిరుడు దేవేందర్, నిరుడు సురేష్, నీరుడి శంకర్, గోరెంక శ్రీశైలం, పెండ్యాల నర్సింగ్ రావు, లింగంపల్లి మల్లేష్, ఇండ్ల జగదీశ్, నీరుడి నవీన్, ఇండ్ల నవీన్, లింగంపల్లి కాశీవిశ్వనాథ్, మేకల వెంకటేష్, మేకల నర్సింగ్, మహేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# కుమారుడి జ్ఞాపకార్థం పారిశుధ్య కార్మికులకు బియ్యం బస్తాలు పంపిణీ చేసిన మంద వెంకటేశ్వర్లు

### మంద రాకేష్ చిత్రపటానికి నివాళులర్పించిన వాసిరెడ్డి మురళి





కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) భద్రాద్రి జిల్లా, చుంచుపల్లి మండలంలో విద్యానగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంద రాజేష్ 2 వ వర్ధంతి వేడుకలు మంద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల సిపిఐ కార్యదర్శి వాసిరెడ్డి మురళి పాల్గొన్నారు. మంద రాజేష్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజేష్ తండ్రి మంద వెంకటేశ్వర్లు భద్రాద్రి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన కుమారుడు మంద రాకేష్ 2 సంవత్సరాల క్రితం మరణించగా, కుమారుడి జ్ఞాపకార్థంగా మండలంలోని విద్యానగర్ పంచాయతీలో పనిచేస్తున్న 26 మంది పారిశుధ్య కార్మికులకు 26 బియ్యం బస్తాలను సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, సిపిఐ నాయకులు జలీల్ పాషా, భవాని ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి మురళి మాట్లాడుతు... కనీస వేతనాలు రానప్పటికీ తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా పంచాయతీని ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల కష్టాలను తెలుసుకుని కుమారుడి జ్ఞాపకార్థంగా ప్రతి ఒక్కరికి బియ్యం బస్తాలను అందిచడాన్ని అభినందించారు. మంద వెంకటేశ్వర్లు కు వారి కుటుంబానికి మనోధైర్యం చెప్పారు. మంద వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... తన కుమారుడి అలోచనలకు అనుగుణంగా ప్రతి సంవత్సరం పేదలకు లబ్ది చేకూరె కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మంద సుజాత, మంద గణేష్, గోపి చందర్, రియల్ ఎస్టేట్ పాషా, పంచాయతీ సిబ్బంది అమర్, రామకృష్ణ, కిషోర్, శ్రీను, సురేష్, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి నగలు దొంగిలించిన దంపతులు అరెస్ట్

కల్వకుర్తి,: కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో రాచమల్ల మల్లమ్మ అనే వృద్ధురాలి మెడలోని తొమ్మిది గ్రాముల బంగారు గుండ్లహారాన్ని ఇద్దరు వ్యక్తులు మాయమాటలు చెప్పి దొంగిలించారు. అనుమానం వచ్చి పరిశీలించగా నకిలీ అని తెలియడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు, నిందితులు మిడ్జిల్ లోని బంగారు దుకాణంలో నగలు అమ్మి డబ్బులు తీసుకున్నారని గుర్తించారు. వీరిని శంషాబాద్ సిసిఎస్ పోలీసుల సహాయంతో పట్టుకున్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతుకు తీవ్ర గాయాలు

నారాయణపేట, : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఉప్పర్పల్లిలో పొలంలో మరమ్మతులు చేస్తున్న రైతు రవీందర్ రెడ్డి విద్యుత్ షాక్ తో తీవ్రంగా గాయపడ్డాడు. లైన్మెన్ నుంచి ఎల్సీ తీసుకున్నప్పటికీ, విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధితుడిని ఆసుపత్రికి తరలించగా, పోలీసులు విచారణ చేపట్టారు.

## అయోధ్యనగర్‌లో ఇంటింటికి బీజేపీ

అచ్చంపేట,: అచ్చంపేట చారకొండ మండలం అయోధ్యనగర్ లో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం జరిగింది. మండల అధ్యక్షులు చెలమోని కృష్ణ, ఉపాధ్యక్షులు కామోజీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శివర్ల నరేష్, పగడల తిరుపతయ్య, అందుగుల వేణు, తోట శంకర్ తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతుకు తీవ్ర గాయాలు

మక్తల్, : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఉప్పర్పల్లిలో పొలంలో మరమ్మతులు చేస్తున్న రైతు రవీందర్ రెడ్డి విద్యుత్ షాక్ తో తీవ్రంగా గాయపడ్డాడు. లైన్మెన్ నుంచి ఎల్సీ తీసుకున్నప్పటికీ, విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధితుడిని ఆసుపత్రికి తరలించగా, పోలీసులు విచారణ చేపట్టారు.

## అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీక రాఖీ

మునుగోడు, : చెల్లికి అన్న అండగా, అన్నకి చెల్లి తోడుగా జీవితాంతం ఉంటామని భరోసా కల్పించే బంధమే రక్షాబంధన్ అని ట్రస్మా జిల్లా అధ్యక్షులు కోడి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నాంపల్లిలోని గాంధీజీ పాఠశాలలో విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చుని వినూత్నంగా రాఖీ వేడుకలు నిర్వహించుకున్నారు. రక్త సంబంధానికి, ఆప్యాయతకు, అనుబంధాలకు రాఖీ ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తండ్రికి నివాళి

నల్లగొండ, : నల్గొండ మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందుపట్ల పరమేష్ తండ్రి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన దశదినకర్మలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఐతగోని శేఖర్ గౌడ్, పెరిక శ్రీను, జిల్లపల్లి ఇంద్ర, మట్టపల్లి సైదులు, జానీ, కళమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్టుకు స్వల్పంగా కొనసాగుతున్న వరద

నాగార్జునసాగర్, : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతోంది. శుక్రవారం జలాశయానికి ఇన్ ఫ్లో 65,876 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 43,251 క్యూసెకులు నమోదైంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను 588.80 అడుగులకు చేరుకుంది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలకు గాను 308.4658 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది.

## అనంతగిరిలో వరి పొలాలు ధ్వంసం

దేవరకొండ, : అనంతగిరి మండలం వాయిల సింగారంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి ఊర చెరువు కింద వరి పొలాలు పూర్తిగా నష్టపోయాయి. పొలాల్లో ఇసుక మేట వేయడంతో పాటు పలు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. ఇటీవల వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులు ఈ బీభత్సంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఇస్సాపల్లిలో అహింసాయుత శాఖాహార ర్యాలీ

ఆర్మూర్,: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో ఈనెల 10వ తేదీన 'అహింసాయుత మహా కరుణ శాఖాహార ర్యాలీ'ని పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయి కృష్ణారెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ ర్యాలీతో పాటు ఆనంద ఆదివారం, ధ్యాన జ్ఞాన కార్యక్రమం, పౌర్ణమి ధ్యానం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు..

## డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వేగవంతం



బోధన్, : నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీమ్గల్ మున్సిపాలిటీలలో పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన విద్యుత్, మున్సిపల్, ఆర్అండ్‌బి, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## పొలానికి నీళ్లు పెడుతూ రైతు విద్యుత్ షాక్‌తో మృతి

వికారాబాద్, : వికారాబాద్ జిల్లా యాలాల మండలం ముద్దయిపేట గ్రామంలో పాలేపల్లి రమేష్ (38) శుక్రవారం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి, సర్వీస్ వైరును సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అతడి భార్య, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## న్యాయవాది ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం,: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో న్యాయవాది నరేందర్ గౌడ్ (34) ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి తన వ్యవసాయ క్షేత్రంలో ఉరివేసుకున్నాడు. కుటుంబ ఆస్తి తగాదాలే ఆత్మహత్యకు కారణమని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనతో చర్ల పటేల్ గూడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఖైరతాబాద్‌లో వ్యక్తి దారుణ హత్య

ఖైరతాబాద్,: ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సిమెంట్ రాయితో తలపై దాడి చేయడంతో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి ఫుట్‌పాత్‌పై రక్తపు మడుగులో పడి ఉన్న అతన్ని గమనించిన వెంకటేష్ అనే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అతన్ని ఆసుపత్రికి తరలించినప్పటికీ, బుధవారం రాత్రి అతను మృతి చెందాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లు ఎత్తివేత?

మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్ ఆగస్టు 8

గత రెండు రోజుల నుంచి జిహెచ్ఎంసి పరిధిలో భారీ వర్షాలు కురువడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీనితో హిమాయత్‌సాగర్‌కు వరద ఉధృతి పెరుగుతోంది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయికి చేరిన నీటి మట్టం పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. మూసీ పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

## మంథనిలో వైభవంగా వరలక్ష్మి వ్రతాలు, కుంకుమార్చనలు

### - శ్రీ మహాలక్ష్మి దేవాలయానికి పోటెత్తిన మహిళా భక్తులు



**మంథని** శ్రావణ మాసంలో అత్యంత పవిత్రమైన రోజు వరలక్ష్మి శుక్రవారాన్ని పురస్కరించుకుని మంథని పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. . భారీ సంఖ్యలో మహిళా భక్తులు శ్రీమహాలక్ష్మి, శ్రీకన్యకాపరమేశ్వరి, శ్రీలలితాంభిక అమ్మవార్ల ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, తమ ఇండ్లలో వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు.మంథని పట్టణంలోని ఎంతో మహిమాన్వితం కలిగిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ఉదయం 3 గంటలకు అమ్మవారి మూల విగ్రహమునకు ఫల పంచామృతాలతో అభిషేకం చేయించే కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే శ్రీ చక్రమునకు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు.

సహస్రనామ త్రిషది నామ ఖడ్గనామ, కుంకుమార్చన అనంతరం హారతి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 9:30 గంటల నుండి మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు దేవాలయానికి మహిళా భక్తులు పోటెత్తారు. సాయంత్రం 5 గంటలకు సామూహిక లలిత సహస్రనామ పారాయణము, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం తొమ్మిది గంటలకు పూజా కార్యక్రమం నిర్వహించి తలయింపు సేవతో వరలక్ష్మి శుక్రవారం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ తెలిపారు. అనాదిగా ఎంతో విశిష్టత కలిగిన అమ్మవారిని దర్శించుకోవడానికి ఉదయం 5 గంటల నుండి భక్తుల సందడి మొదలయింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి మంథని పట్టణంతో పాటు పరిసర గ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయంలో పండుగ వాతావరణ నెలకొంది. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం ముందు ఉన్న పోచమ్మ తల్లి ఆలయం కూడా భక్తులతో కిటకిటలాడింది. అందుకు తగిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

# పి-4 విధానాన్ని అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలి

### - కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



**బద్వేలు** కడప జిల్లాలో పీ-4 పథకానికి సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బంగారు కుటుంబాల మ్యాపింగ్,దత్తత ప్రక్రియను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో.. పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక కాలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు జేసి అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. వీసీ ద్వారా..రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఖ4 పాలసీ,గ్రామ సభలు అసెస్మెంట్ సర్వేలు, వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లు చొరవ చూపాలన్నారు.పి 4 బంగారు కుటుంబాల దత్తత, మండలాల దత్తత,గ్రామాల దత్తత,ఆర్థిక అవసరాలు తీర్చే విధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయడం జరిగిందన్నారు.ఆగస్టు 15 తేదీ నాటికి 15లక్షల బంగారు కుటుంబాలు గుర్తించడానికి లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికీ 10.10 లక్షల బంగారు కుటుంబాలు, మార్గదర్శులను 1.12 లక్షలు గుర్తించి 67% పూర్తయిందని ఈ సందర్భంగా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. మిగిలి ఉన్న లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు.ఎన్టీఆర్ బరోసా పెన్షన్, రెవెన్యూ సేవలు,వైద్య సేవలు,దేవాలయాలు సేవలువంటి ప్రభుత్వ పథకాలు సేవలపై ఐ వి ఆర్ ఎస్, ద్వారా ప్రజల నుంచి సేకరిస్తున్న ప్రజాస్పందనపై ఆయా జిల్లాల వారిగా సమీక్షలు చేసి పాజిటివ్ పర్సెప్షన్ పెంచాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు.జిల్లాలలో పారిశ్రామిక అభివృద్ధి కి అవరోధాలు రాకుండా అందుకు సంబంధించిన ఎన్ ఓ సిలు,ఇతర రెవెన్యూ అంశాలలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు.యూరియా పంపిణీ లో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.వీసి అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ....జిల్లాలో గ్రామసభల ద్వారా నిర్వహిస్తున్న అసెస్మెంట్ సర్వే త్వరతగతిన పూర్తి అవ్వాలన్నారు.డాక్యుమెంట్సు అప్లోడ్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతతో అమలు చేస్తున్న జీరో పావర్టీ, ఖ4పాలసీ, బంగారుకుటుంబాలు, మార్గదర్శులు,గ్రామ సభలు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో యూరియా లో పంపిణీ లో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ పతక నగదు జమ కావాలని ఈ అంశంలో ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు.ప్రభుత్వ పథకాలు సేవలు అందించడంలో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ సేవలు సంతృప్త స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ వో విశ్వేశ్వర నాయుడు,సీపీవో హాజరతయ్య,పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, ఏపీఐఐసీ జెడ్ ఏం శ్రీనివాసమూర్తి, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, వ్యవసాయశాఖ జేడీ చంద్రబాబు, డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడు కొండలు,పర్యాటక శాఖ అధికారి సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలందుకున్న దేవత

### ఇస్తినమ్మ వాయునం పుచ్చుకుంటినమ్మ వాయునం



**మణుగూరు** : మండలంలోని మహిళ మూర్తులు కుటుంబ సభ్యులతో వరలక్ష్మి వ్రతం పూజలు ఇంట్లోనే ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం మన ఆచారం. ఈ శుక్రవారం ఉదయాన్నే మహిళలు లేచి ఇంటిముందు కలాపు చల్లి రంగు రంగు ముగ్గులు వేసి ఇంటికి తోరణాలు కట్టి తలంటు స్నానాలు చేసి భక్తి శ్రద్ధలతో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి కలశాన్ని తొమ్మిది రకాల పూలతో అలంకరిస్తారు. పసుపు ముద్దతో గౌరమ్మను తయారుచేసి గణపతి స్తోత్రాన్ని పటిస్తారు. పలు రకాల పండ్లు, పిండివంటలు, పులిహోర, పాయసం, పంచామృతం, వడపప్పు, ఉడకబెట్టిన శనగలు వంటివి లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం ఐదుగురు ముత్తైదువులకు వాయనం సమర్పించి ఇస్తినమ్మ వాయునం పుచ్చుకుంటినమ్మ వాయునం అంటూ వారి దగ్గర ఆశీర్వాదాలు తీసుకుంటారు. వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్య. అందువలన ఈ పండగ విశిష్టమైనదిగా భావిస్తారు. వరాలు యిచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారు.

ఈ పూజలు తెలుగు రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారు. ఈపండగను ముఖ్యంగా వివాహమైన స్త్రీలు నిర్వహిస్తారు. ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబసభ్యులు కూడా పాలుపంచుకుంటారు. ముఖ్యంగా పెళ్లి కాని అమ్మాయిలు మంచి భర్త రావాలని, పెళ్ళైన మహిళలు సంతానం కలగాలని కూడా పూజిస్తారు. ఈ దేవతను పూజిస్తే అష్టశ్వర్యాలు, సిరిసంపదలు, భోగభాగ్యాలు, ఆయురారోగ్యాలతో సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసంతో అమ్మవారిని కొలుస్తారు.

## ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**మహబూబాబాద్ :** :శుక్రవారం ఉదయం ఇంచార్జీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మహబూబాబాద్ పట్టణంలోని వార్డులను, మార్కెట్, జక్షన్ల ప్రాంతాలలో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు మున్సిపల్ సిబ్బంది, ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ, షెడ్యూల్ ప్రకారం ప్రతీ రోజూ వార్డులు మార్కెట్ జక్షన్లు ప్రాంతాలలో శానిటేషన్ చెయ్యాలని, నీరు నిలువ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయాలని, వ్యర్థాలను వెంట వెంటనే తరలించి, తడి చెత్త, పోడి చెత్త ను వేరు చేసి సెగ్రిజేషన్ చేయాలన్నారు.ప్రస్తుతం వర్షాలు కురుస్తునందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని, ప్రజలు మున్సిపల్ ఆస్తి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. పెండింగ్ లో ఉన్న జంక్షన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలువలు, తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్, శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్, తదితరులు ఉన్నారు.

# భారత్ అమెరికాల మధ్యా విభేదాలు

**సుంకాల పేరుతో పెరుగుతున్నా గ్యాప్**

**పాకిస్థాన్ కు అనుకులంగా మారుతుందా.**

**దేశ ప్రయోజనాలే ముఖ్యమంటున్న భారత్**

**మరోసారి అమెరికాకు పాక్ ఆర్మీ చీఫ్**

రష్యా నుంచి ముడి చమురులను దిగుమతి చేసుకుంటున్న భారత్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడుతున్న సంగతి వాస్తవమే. దీని కారణంగానే భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాన్ని విధించారు. మొదటి సారి 25 శాతం సుంకాన్ని పెంచిన భారత్ అమెరికా దారిలోకి వెళ్లకపోవడంతో రెండోసారి 25 శాతం సుంకాన్ని పెంచారు. అదనపు సుంకాలతో ఇండియాను ఇబ్బంది పెట్టే ప్రయత్నాన్ని చేస్తున్నారు ట్రంప్. అపరేషన్ సిందూర్ తర్వాత జూన్ నెలలో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికా అద్యక్షుడు డ్రోనల్డ్ ట్రంప్ పాకిస్థానుకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తునే ఉంది.

## దేశ ప్రయోజనాలే ప్రధానం

సుంకాల పెంపుతో అమెరికా భారత్ మధ్య విబేధాలు పెరుగుతున్నయి. అమెరికా సుంకాలను పెంచుతున్న తరుణంలో తమకు దేశ ప్రయోజనాలే ప్రధానమని భారత్ స్పష్టం చేసింది. ట్రంపు తీరుపై బారత్‌లో తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ట్రంపు నిర్ణయంపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ఈ చర్య అన్యాయమని ఇది సమర్దనీయం కాదని పేర్కొంది. 140 కోట్ల ప్రజల ఇందన భద్రతను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుని దిగుమతి చేసుకుంటామని భారత్ తెలిపింది. భారత్ ను లక్ష్యంగా చేసుకోవడం బాధకరమని భారత్ పెర్కోంది.

ట్రంపు తీరుపై సొంత పార్టీ నేతలు కూడా మండిపడుతున్నారు. స్నేహబందమైన భారత దేశంలో కయ్యం వద్దని హితువు పలుకుతున్నారు.

## పాకిస్థాన్ కు స్వల్ప సుంకాలు

భారత్ కు రెండు సార్లు సుంకాలను పెంచిన అమెరికా పాకిస్థాన్ కు మాత్రం తక్కువ సుంకాలను విధించింది. బారత్ కు సుంకాలు పెంచడంతో భారత్ అమెరికాల మధ్య పెరిగిన ఈ గ్యాప్ ను పాకిస్తాను సద్వినియోగం చేసుకోవలనుకుంటుంది. ఇరుదేశాల మధ్య స్నేహశీలిని పెంచేందుకు అమెరికాకు రెండోసారి ప్రయాణం అవుతున్నాడు పాక్ ఆర్మీ చీఫ్. భారత్ అమెరికాల విబేదాలను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తుంది పాకిస్థాన్. భారత్‌పై ఇలా కఠిన వైఖరి అవలంబిస్తున్న తరుణంలోనే, పాకిస్థాన్‌తో అమెరికా సంబంధాలు మెరుగుపడుతుండటం గమనార్హం. ఇటీవల అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అధిపతి జనరల్ మైఖేల్ ఎరిక్ కురిల్లా కూడా పాకిస్థాన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పాక్ ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత సైనిక పురస్కారమైన 'నిషాన్-ఇ-ఇంతియాజ్'ను ప్రదానం చేసింది.

## రష్యా యుద్ధం ఆపితే..

నేటితో రష్యాకు ఉక్రెయిన్ తో యుద్ధం ఆపాలంటూ ట్రంప్ విధించిన ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, రష్యా- ఉక్రెయిన్ యుద్ధ విరమణకు సంబంధించిన చర్చల్లో కీలక పురోగతి సాధించినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే రష్యా యుద్ధం ఆపేస్తే భారత్ పై పన్నుల భారం తగ్గిస్తారా అంటూ ఓ మీడియా ప్రతినిధి ట్రంప్ ను ప్రశ్నించగా రష్యా యుద్ధం ఆపేస్తే భారత్ పై పన్నులు తగ్గుతాయా అంటే చెప్పలేం. బహుశా తగ్గొచ్చు. కానీ ఇప్పుడే చెప్పలేను. చర్చల్లో



కవిరత్న అమీనా కలందర్ జర్నలిస్ట్

పురోగతి సాధించడానికి భారత్ పై విధించిన అదనపు సుంకాలు కూడా కారణం కావొచ్చు. అందువల్ల టారిఫ్ లు తగ్గే అవకాశం ఉంది' అని వివరించారు. అయితే, ప్రస్తుతం భారత్ పై 25 శాతం సుంకాలు అమలులోకి వచ్చాయని, ఈ నెల 27 నుంచి అదనపు సుంకాలు అమలు చేస్తామని చెప్పారు. ప్రస్తుతానికి ఈ పన్నులు చెల్లించాల్సిందేనని ట్రంప్ స్పష్టం చేశారు.

# అన్న చెల్లెళ్ళు - అక్కాతమ్ముళ్ళ ప్రేమానుబంధానికి ప్రతీక 'రక్షాబంధన్'

అన్న చెల్లెళ్ళు - అక్క తమ్ముళ్ళ మధ్య ఉన్న ప్రేమానుబంధం ఎంతో ప్రత్యేకమైనది. ఇది మాటల్లో వర్ణించలేనిది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలో అసాధారణమైన తోబుట్టువుల మధ్య ప్రేమానుబంధం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. అయితే, మన దేశంలో తోబుట్టువుల ప్రేమ కోసం అంకితం చేయబడిన రక్షా బంధన్ అనే పండుగతో ఈ ప్రేమానురాగాలు మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. రక్షా బందన్ (రాఖీ పౌర్ణమి) పండగను భారత్ తో పాటు ప్రపంచంలోని పలు దేశాలలో అన్న చెల్లెళ్ళు అక్క తమ్ముళ్ళ మధ్య ప్రేమకు ప్రతీకగా జరుపుకునే ప్రత్యేక హిందూ పండుగ. రక్షా బంధన్ పండగను శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున జరుపుకుంటారు,



## రక్షా బంధన్ యొక్క పరమార్థం

రెండు పదాల కలయికతో ఈ పండగ రూపొందించబడింది. రక్ష - బంధన్ సంస్కృత పరిభాష ప్రకారం రక్షణ - ముడి. ఇక్కడ రక్ష అంటే రక్షణ, బంధన్ అంటే కట్టడానికి క్రియ. ఈ పండుగ అన్నదమ్ముల - అక్కాచెల్లెళ్ళ శాశ్వతమైన ప్రేమానుబంధాన్ని సూచిస్తుంది, భారతదేశంలోని వివిధ మతాలలో రక్షా బంధన్ కు అత్యంత ప్రాముఖ్యత ఉంది.

## రక్షా బంధన్ పండుగ మూలం

రక్షా బంధన్ (రాఖీ పండుగ) శతాబ్దాల క్రితం ఉద్భవించిందని చరిత్ర వల్ల తెలుస్తుంది. హిందూ పురాణాలలో రాఖీ పండగకు సంబందించి అనేక కథలు ఉన్నాయి.

## ఇంద్రుడు శచి- కథ

భవిష్య పురాణం యొక్క పురాతన పురాణం ప్రకారం, ఒకప్పుడు దేవతలు, రాక్షసుల మధ్య భీకర యుద్ధం జరిగింది. దేవతల పక్షాన యుద్ధం చేస్తున్న ఆకాశం, వర్షాలు, పిడుగులకు ప్రధాన దేవత అయిన ఇంద్రుడు శక్తివంతమైన రాక్షస రాజు బలిచక్రవర్తి నుండి కఠినమైన ప్రతిఘటనను ఎదుర్కొనగా ఈ యుద్ధంలో ఇంద్రుడు బలహీనంగా ఉన్న సమయంలో అతని భార్య శచీదేవి అతనికి చేతి మనికట్టుకు రక్షణగా పవిత్ర దారాన్ని కడుతుంది. ఈ పవిత్ర దారం ఇంద్రుడికి విజయాన్ని చేకూర్చిందని, అప్పటి నుండి రక్షా బంధనం అనే ఈ పండుగ ఆరంభమైందని ప్రజలు విశ్వసిస్తారు.

## బలిరాజు లక్ష్మీదేవి- కథ

భాగవత పురాణం, విష్ణు పురాణం ప్రకారం, శ్రీమహావిష్ణువు రాక్షస రాజుబలి నుండి మూడు లోకాలను గెలుచుకున్నప్పుడు రాక్షసరాజు కోరికతో మహావిష్ణువు పాతాలలోకంలో బలిచక్రవర్తితో నివసించడం ప్రారంభించాడు. అయితే, మహావిష్ణువు భార్య లక్ష్మీదేవి రాక్షసరాజు బలిచక్రవర్తి మణికట్టుకు రాఖీ కట్టి అతని నుండి తిరిగి ఇచ్చే బహుమతిగా తన భర్తను ప్రతిజ్ఞ నుండి విడిపించి వైకుంఠానికి తిరిగి వెళ్ళనివ్వమని బలిని కోరింది. ఆమె అభ్యర్థనకు బలిచక్రవర్తి అంగీకరించి శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో వైకుంటానికి తిరిగి చేరుకున్నాడు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి రాఖీని కట్టడం ఈ పండుగ విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళు జరుపుకునే మహెూత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహెూన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటు అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ.

## ద్రౌపది - శ్రీకృష్ణుని అనుబంధం

ఇతిహాసాల ప్రకారం ద్రౌపది, శ్రీకృష్ణుని అన్నాచెల్లెల అనుబంధం అత్యంత గొప్ప అనుబంధంగా కనిపిస్తుంది. శిశుపాలుడిని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడు వేలుకు రక్తం ధారగా కారుతుండగా అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగును చింపి వేలికి కట్టు కట్టిందట. దానికి కృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని శ్రీకృష్ణుడు ద్రౌపదికి హామీ ఇస్తాడు. అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుండి ఆమెను కాపాడుతాడని మన ఇతిహసాల సారాంశం.

## అలెగ్జాండర్ భార్య - పురుషోత్తముడి కథ

చరిత్రపుటల్లో అలెగ్జాండర్ భార్య రోక్సానా తక్షశిల రాజు పురుషోత్తముడిని తన సోదరుడిగా భావించి రాఖీ కడుతుంది. జగజ్జేతగా మారాలనే తపనతో గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీస్తు పూర్వం 326లో భారత దేశంపై దండెత్తుతాడు. ఆ క్రమంలో బాక్ట్రియా (నేటి ఆఫ్ఘనిస్తాన్)కు చెందిన యువరాణి రోక్సానాను వివాహం చేసుకుంటాడు. ఆమె వివాహ సంబంధాన్ని ఉపయోగించుకుని మధ్య ఆసియా దేశాలను, ముఖ్యంగా జీలం, చినాబ్ నదుల మధ్య ఉన్న రాజ్యాలను జయించాలని అలెగ్జాండర్ యుద్ధం ప్రకటిస్తాడు. పురుషోత్తముడి శత్రురాజు అంబి, అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తాలని ఆహ్వానిస్తాడు. పురుషోత్తముడు యుద్దానికి సిద్ధమవుతాడు. అయితే అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముడిని తన అన్నలా భావించి రాఖీ కడుతుంది. తన భర్త అయిన అలెగ్జండర్‌ను చంపవద్దని రోక్సానా పురుషోత్తముడిని కోరుతుంది. దీంతో పురుషోత్తముడు యుద్ధం గెలిచినా అలెగ్జాండర్‌ను చంపకుండా విడిచిపెడతాడు.

రక్షా బంధన్ పండుగను సోదరులు - సోదరీమణుల మధ్య విధికి చిహ్నంగా జరుపుకుంటారు. జీవశాస్త్రపరంగా సంబంధం లేని స్త్రీపురుషుల మధ్య సోదర-సోదరి సంబంధాన్ని జరుపుకోనే ఉద్దేశమే రక్షాబందన్ పండగ పరమార్థం. రక్షాబందన్ రోజున, సోదరి తన సోదరుడి శ్రేయస్సు, ఆరోగ్యం, కోసం ప్రార్థిస్తు అతని మణికట్టుకు రాఖీని కడుతుంది. ప్రతిగా సోదరుడు తన సోదరికి బహుమతులు ఇస్తు తన సోదరిని ఏదైనా హాని నుండి లేదా ప్రతి పరిస్థితిలో రక్షిస్తానని వాగ్దానం చేస్తాడు. ఈ పండుగను దూరపు కుటుంబ సభ్యులు, బంధువులు లేదా బంధువులకు చెందిన అన్నదమ్ముల మధ్య కూడా జరుపుకోవడం విశేషం.

## ఉపాకర్మ-వేదవ్రత చతుష్టయము

"యజ్ఞోపవీతం పరమపవిత్రం
ప్రజాపతే ర్యత్స హజం పురస్తాదా !
యుష్యమగ్ర్యం ప్రతిముంచ శుభ్రం
యజ్ఞోపవీతం బలమస్తు తేజః" !!

యజ్ఞోపవీతంకు పూజ చేసి నూతన యజ్ఞోపవీతం ధరిస్తారు. ఇలా శ్రావణ పూర్ణిమను ఎన్నెన్నో రకాలుగా పండుగను జరుపుకోవడం విశేషం

ప్రతీ సంవత్సరము శ్రావణ పౌర్ణమి రోజున నాలుగు వేదశాఖల వారు ఉపాకర్మ అనువేద వ్రతమును ఆరంభిస్తారు.

1) ప్రాజాపత్య వ్రతము
2) సౌమ్య వ్రతము
3) ఆగ్నేయ వ్రతము
4) వైశ్వదేవ వ్రతము

వీనినే వేదవ్రత చతుష్టయము అని అందురు. ఆ నాలుగు వ్రతములు, వీనికి ఉత్సర్జనములు చేయవలయును. ఉపనయనము అయిన వటువు గురుకులము నందు వేదము నేర్చుకొను కాలంలో వ్రతములు చేయవలెను. ఒక్కొక్క వ్రతము ఒక్కొక్క సంవత్సరమునందు చేయవలెను. ఒక సంవత్సరము వ్రతము, మరొక సంవత్సరము నందు ఉత్సర్జనము చేయవలెను. ఈ విధముగ 4 వ్రతములు, 4 ఉత్సర్జనములు పూర్తయే వరకు 8 సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ 8 సం.రాలలో గురుకులములో గోదానం, వేద సంస్కారము జరుపుకొనవలెను. అనగా గర్భాష్టమేషు బ్రాహ్మణాముపనయాత- 8 సంవత్సరములో ఉపనయనము జరిగిన, 8 సంవత్సరములు గురుకులం ఉండుటతో 16 సం.లు పూర్తిఅగునని భావము. యజుర్వేదము నందు ప్రాజాపత్యకాండము, సౌమ్యకాండము, ఆగ్నేయ కాండము, వైశ్వదేవ కాండము అను 4 కాండములు కలవు. కాండ ప్రమాణములు ప్రస్తుతము తెలియుటలేదు. శ్రావణమాసంలో పూర్ణిమ రోజున శ్రవణా నక్షత్రం ఉంటుంది. ఈ రోజు పగటి కాలంలో ఉపాకర్మ చేయవలసి ఉంది. శ్రావణ శుద్ధ పంచమి రోజున హస్తా నక్షత్రంలో చేయవచ్చును. ఔపాసనాగ్నిలో అధ్యాయోపా కర్మ చేయవలెనని శౌనకుడు సూచించాడని, ఈ విధమగు యుక్తాయుక్త కాలనిర్ణయము చూచుకొని వేదప్రతిపాదితమగు ఉపాకర్మాది సంస్కారముల ఆచరించవలసిఉన్నది. ఈ సంస్కారము ముఖ్యముగా వేదము నేర్చుకొను విద్యార్థుల కొరకు నిర్దేశించబడినది. అపౌరుషములు, దైవదత్తములగు వేదశాస్త్రములను నేర్చుకొనుటకు, తగుశక్తి, తేజస్సు, గ్రహణశక్తి, ఆత్మజ్ఞానము స్పష్టమగు శబ్దోచ్చారణ, శ్రావ్యమగు ధ్వనిని కలిగి వేదవిద్యను నేర్చుకొనుటకు వేదమంత్రములచే చేయబడు సంస్కారమిది. అందుకనే శ్రావణ పౌర్ణమి భారత దేశమందు ముఖ్య పర్వదినముగా చెప్పబడుచున్నది.



**రాఖీపౌర్ణమి శుభాకాంక్షలతో**

**సంతోజు రవికుమార్**

**బడంగ్ పేట్. రంగారెడ్డి**

## ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య

ఆదిలాబాద్, : కాసిపేట మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన 44 ఏళ్ల గంగాధారి వాణి, ఆర్థిక ఇబ్బందులు శుక్రవారం తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త శంకర్ తాగుడుకు బానిసై, ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో కుటుంబ భారం మొత్తం వాణిపై పడింది. మిషన్ పని చేస్తూ కూడా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వాణి, మనస్తాపంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఎస్సై గంగాగారం తెలిపారు.

## తాండూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం

బోథ్, : తాండూర్ మండలంలోని మాదారం 3 ఇంక్లైన్ వద్ద రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. నర్సాపూర్ పంచాయతీ బాపుగూడెంకు చెందిన ప్రశాంత్, తాండూర్ నుంచి బైక్ పై ఇంటికి వెళ్తుండగా, ఎత్తుగడ్డ ప్రాంతంలో రోడ్డుపై ఉన్న గేదెను గమనించక వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రశాంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

## ఎమ్మెల్యేకు మురుగు కాల్వలు, రోడ్ల కోసం వినతి

నిర్మల్, : మంజులాపూర్ శివాజీ నగర్ వాసులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందించారు. తమ వీధిలో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. వర్షాకాలంలో కాలనీ మొత్తం జలమయం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. లింగారెడ్డి, నర్సయ్య, ప్రవీణ్, శశి కుమార్, సాయి తదితరులు ఈ వినతిలో పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోరారు.

## అభయారణ్యంలో భారీ వాహనాలకు అనుమతి ఇవ్వాలి



ఖానాపూర్, : జన్నారం మండలంలోని చికెన్ సెంటర్ అసోసియేషన్ సభ్యులు, అభయారణ్యంలో భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ గ్రామంలో భూమాచారి, బద్రీ నాయక్ లు చేపట్టిన దీక్షకు వారు మద్దతు తెలిపారు. అటవీ ఆంక్షల వల్ల తమ ప్రాంత అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, మండల అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ముథోల్, : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం నిర్మల్ టౌన్, నిర్మల్ రూరల్, సోన్, దిలవార్ పూర్, నర్సాపూర్ (జి), లక్ష్మణచందా, మామడ మండలాలకు చెందిన 153 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ నిధి ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## పెళ్లైన మూడు రోజులకే మృత్యుఒడిలోకి

కరీంనగర్, : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ముద్దసాని అఖిల (22) అనే యువతి మృతి చెందింది. ఆమె భర్త రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. పీజీ సెట్ పరీక్ష రాసి కరీంనగర్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మూడు రోజుల క్రితం వివాహమైన అఖిల మరణంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఎల్ఎండి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అవమానభారంతో యువకుడు సూసైడ్

పెద్దపల్లి, : పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని వడకాపూర్‌లో మద్యం దుకాణంలో డబ్బులు పోయాయని నిర్వాహకుడు అవమానించడంతో ఐలవేని రంజిత్ (25) అనే యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మద్యం తాగడానికి వెళ్లినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ అవమానభారంతోనే రంజిత్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



జగిత్యాల, : జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌ను ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి, ముందస్తు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల మైదానంలో అభివృద్ధి పనులు, వాకింగ్ ట్రాక్ కోసం నిధులు మంజూరు చేయడంలో ఎమ్మెల్యే కృషికి గాను ఆయనను శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు.

## రాఖీతో పాటు ఆదివారం సెలవు

హుజూరాబాద్, : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ రాఖీ పండుగ సందర్భంగా శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు ప్రకటించింది. సోమవారం మార్కెట్ తిరిగి తెరుచుకుంటుందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం తెలిపారు. శుక్రవారం మార్కెట్కు 10 క్వింటాళ్ల విడి పత్తి రాగా, గరిష్ఠ ధర రూ. 7, 550 పలికింది. కార్యకలాపాలను కార్యదర్శులు మల్లేశం, రాజా పరిశీలించారు.

# “చెక్కులు అన్ని చిక్కులకు సంజీవని”

**:ఎమ్మెల్యే శ్రీ గణేష్**

**కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ “62”చెక్కులు,ఆ కుటుంబాల్లో వెలుగులు**

**ఎదురుచూస్తున్న మహిళలకు**

**“వరలక్ష్మి రోజున”:1,00116/అందజేయడం ఆనందంగా ఉంది**

**పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలుగువారి పర్వదినాల్లో మహిళలకు ఇష్టమైన పండుగ “శ్రావణ మాసం”ఆ నెలలో శుక్రవారం రోజున ప్రత్యేకంగా చేసే పూజా కార్యక్రమం అందరికి తెలిసిందే!నిన్న చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా “వరలక్ష్మి పూజా”ఘనంగా నిర్వహించే ప్రతి



ఆడపడుచు ఆ కుటుంబం అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉండాలని మహాలక్ష్మి దేవి ప్రత్యేకంగా కోరుకునే రోజు సందర్భంగా నిన్న “62”మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను తిరుమలగిరి ఎమ్మార్వో బిక్షపతి నేతృత్వంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు అందరికీ పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలో 62 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న శుక్రవారం ఉదయం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో కలిసి పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, పేద కుటుంబాలు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి అప్పుల పాలు కావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకం ద్వారా 1,00116,/- రూపాయలను అందిస్తుందని, ఈరోజు 62 కుటుంబాలకు చెక్కుల పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో నిరంతరం పర్యవేక్షించి చెక్కుల పంపిణీ ఆలస్యం కాకుండా చూస్తున్నారని, అధికారులు కూడా నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ లు వినయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ లో ఓట్ల తొలగింపు ప్రక్రియపై సిపిఎం నిరసన

**రాజ్యాంగ స్ఫూర్తిని కూనీ చేస్తున్న బిజెపి ప్రభుత్వం**

**ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మల్లా లాంటివాళ్ళు ఓటర్లు**



మంథని ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఈరోజు మంథని మండల కేంద్రంలో సిపిఎం పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వై యాకయ్య మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషన్ తో కుమ్మక్కై 64 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించడం జరిగిందని ప్రసంగించారు.బిజెపి ప్రభుత్వం బీహార్ రాష్ట్రంలోఅధికారంలోకి రావడం కోసం ఎన్నికల కమిషన్తో కుమ్మక్కై తనకు వ్యతిరేకమైన ఓట్లను ఓటరు జాబితా నుండి తొలగించడం జరుగుతుందని. అదే విధంగా ముస్లింలే లక్ష్యంగా చేసుకొని ముస్లిం ఓటర్లను పెద్ద ఎత్తున తొలగిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఎన్నికల కమిషన్ తో కుమ్మక్కై ఈ తతంగం కొనసాగిస్తుందని తెలంగాణ సిపిఎం పార్టీ ముక్తకంఠంతో ఖండిస్తుంది. బీహార్ రాష్ట్రంలో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని,ఓటర్ల తొలగింపును నిలుపుదల చేయాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. వయోజన ఓటింగ్ హక్కు కులాలకు మతాలకు ప్రాంతాలకు సంబంధం లేకుండా రాజ్యాంగంలో ఓటు హక్కును పొందపచారు ఇలాంటి ప్రజాస్వాములు అందరూ బిజెపి ప్రభుత్వం బీహార్ లో చేస్తున్న విధానాన్ని ప్రజాస్వామ్యవాదులు రాజకీయ నాయకులు ఎండ కట్టాలి.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం పార్టీ మంథని నాయకులు బూడిద గణేష్, మంథని లింగయ్య , గొర్రెంకల సురేష్, బావు రవి, నక్క శేకర్ తదితరులు పాల్గొన్నారు

## వేములవాడ మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన ఈఓ రాధాబాయి



వేములవాడ (ప్రశ్న న్యూస్) శ్రావణ మాసం మూడవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దేవస్థాన కార్యనిర్వహణ అధికారి రాధాబాయి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల రాకపోకలు, ఏర్పాట్లను ఈఓ సమీక్షించి, భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అమ్మవారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారి వెంటఆలయ పర్యవేక్షకులు గూడెపు వెంకట ప్రసాద్, ఇన్స్పెక్టర్ మర్రిపెల్లి లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్యంగా కృషి చేయాలి

**- టి.యు.డబ్ల్యు.జె.రాష్ట ఉపాధ్యక్షులు, ౧ జిల్లా అధ్యక్షులు : లాయక్ పాషా**

**- టీయుడబ్ల్యుజె టెంజూ నూతన కమిటీల ఏర్పాటు**



సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) బలంగా పోరాడుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో శుక్రవారం టీయూడబ్ల్యూజే (హెచ్-143) , ఎలక్ట్రానిక్ మీడియా సంఘం (టెంజు) జిల్లా కమిటీలను ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ“పాత్రికేయ సమాజం హక్కుల కోసం అందరం కలిసికట్టుగా కృషి చేయాలి. సంఘ బలోపేతమే జర్నలిస్టుల బలం” అని లాయక్ పాషా పిలుపునిచ్చారు. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

-టీయూడబ్ల్యూజే జిల్లాకమిటీ
- అధ్యక్షులు: లాయక్ పాషా (ఆంధ్రప్రభ)
- ప్రధాన కార్యదర్శి: సామల గట్టు (నమస్తే తెలంగాణ)
- కోశాధికారి: అందే దేవేందర్ (సాక్షి)
- ఉపాధ్యక్షులు: రేగుల రాము (వార్త), జలగం అనిల్ రావు (సూర్య), బొల్లం పరుశురాం (బలగం)
- సంయుక్త కార్యదర్శి: గుర్రాల మోహన్ (నమస్తే తెలంగాణ)
- కార్యనిర్వాహక కార్యదర్శులు: షేక్ రియాజ్ (ప్రజాపోరు), లింగారెడ్డి గారి శేఖర్ రెడ్డి (నమస్తే తెలంగాణ)
- ఇతర సంయుక్త కార్యదర్శులు: బండారి బాలరాజు, బాబ్జి, బైరి బాలరాజు (అందరూ నమస్తే తెలంగాణ)
- కార్యవర్గ సభ్యులు: గడ్డం తిరుపతి (మన తెలంగాణ), అరిగే రమేష్ (ఆంధ్రప్రభ), కూర సంతోష్ (నవ తెలంగాణ), పంజా సంపత్ కుమార్ (తెలంగాణ రిపోర్టర్), సుంచు బాబు (జనం సాక్షి), తుమ్మనపల్లి నరేందర్ (ఆంధ్రప్రభ), రాజూరి విష్ణు (దిశా), మల్యాల ప్రసాద్ (ఆంధ్రప్రభ), ఎల్లాల నర్సారెడ్డి (తెలంగాణ పత్రిక)
- గౌరవ సలహాదారులు: రాపల్లి సంతోష్ కుమార్ (నమస్తే తెలంగాణ), నిమ్మ బాలచందర్ రెడ్డి (సాక్షి), ఆసరి మహేష్ (సాక్షి)
- న్యాయ సలహాదారు: గొట్టే కిరణ్ కుమార్

-టెంజు జిల్లాకమిటీ
అధ్యక్షులు: ఇరుకుల్ల ప్రవీణ్ కుమార్
- ఉపాధ్యక్షులు: చల్లా ప్రసాద్ రెడ్డి, మహమ్మద్ ఇస్మత్
- ప్రధాన కార్యదర్శి: ఎం.డి. అజీం
- కోశాధికారి: యస్.డి. కలీం
- కార్యనిర్వాహక కార్యదర్శి: దారం కృష్ణ
- సంయుక్త కార్యదర్శి: కోడం గంగాధర్
- ప్రచార కార్యదర్శి: బత్తిని శ్రీధర్
- కార్యవర్గ సభ్యులు: మహమ్మద్ సలావుద్దీన్, నక్క రాజు ఏ యాకూబ్, బిట్ల గణేష్, బరిగెల రమేష్, బ్రాహ్మణపల్లి సాయికిరణ్, మామిడిశెట్టి దినేష్, కత్తి రాజు

సీనియర్ జర్నలిస్టులు రాపల్లి సంతోష్ కుమార్, టెంజు అధ్యక్షుడు ఇరుకుల్ల ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు, కోశాధికారి అందే దేవేందర్, సయ్యద్ కలీం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల గోప్యతను కాలరాసిన వారికి శిక్ష తప్పదు

**- భాజపా ఎస్సీ మోర్చా జిల్లాధ్యక్షులు : సంటి మహేష్**

**- కేసీఆర్ - కేటీఆర్ ల భాగోతం బహిర్గతం..!**

**బండికి బీజేపీ నేతల సంఘీభావం**




వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణలో రాజకీయ వాతావరణాన్ని కుదిపేస్తున్న ఫోన్ టాపింగ్ వివాదంపై బీజేపీ పోరుబాటకు దిగింది. మాజీ సీఎం కేసీఆర్,మాజీ మంత్రి కేటీఆర్లు అనేకమంది నాయకుల,సామాన్యుల ఫోన్ సంభాషణలను టాపింగ్ చేయించారని ఆరోపణలు ఉధృతమవుతున్న వేళ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్కు సంఘీభావంగా తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి భాజపా కార్యకర్తలు భాగ్యనగరంలో గర్జించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా భాజపా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్ మాట్లాడుతూ “తండ్రీ%-%కొడుకులు ఫోన్ టాపింగ్ చేసి ఆనందపడిన దారుణానికి ఆధారాలు సేకరించి సిట్ విచారణ కమిటీకి సమర్పించబోతున్నాం. తెలంగాణ ప్రజల గోప్యతను కాలరాసిన వారికి తప్పని సరిగా శిక్ష తప్పదు” అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి శీను, పట్టణ కార్యదర్శి చిక్కుడు మల్లేశం, బుర్ర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సోదర - సోదరీల అనుబంధాలకు ప్రతీక “ రక్షా బంధన్”

**- మండల ప్రజలకు “రాఖీ పౌర్ణమి”పండుగ శుభాకాంక్షలు**

**-కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు : ల్యాగల దేవయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ల్యాగల దేవయ్య మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర సహకార భావాలను పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి నెలకొనాలని దేవయ్య ఆకాంక్షించారు.

## బీజేపీ నాయకులకు మహిళాలు రక్షా బంధన్



నాగారం(ప్రశ్న న్యూస్) నాగారంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు రాఖీ కట్టిన నాగారం మున్సిపల్ మహిళలకు వరలక్ష్మి దేవి ఆశీస్సులు కలగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి మాట్లాడుతూ నాగారం పట్టణంలోని మహిళలు రాఖీ పౌర్ణమి సందర్భంగా నాగారం మున్సిపల్ సిబ్బందికి, బిజెపి నాయకులకి కాలనీ మహిళలు రాఖీ కట్టి మిఠాయి తినిపించారని అన్నారు. నాగారంలో మా పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమంలు, మహిళలకు ప్రత్యేక కార్యక్రమంలు చేశామని ఆయన అన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు చేస్తే ప్రజలు గుర్తిస్తారని ఆయన తెలిపారు. మాజీ కౌన్సిలర్ బిజ్జు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాగారం మున్సిపల్ పరిధిలో మమ్ములను గెలిపించిన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని, పార్కులు, ఓపెన్ జిమ్ములు, డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా వ్యవస్థ, రోడ్ల వ్యవస్థ ఇలా అనేకమైన కాలనీ ప్రజలు అడిగిన వసతులు అన్ని మా పాలనలో అభివృద్ధి చేశామని ప్రజలకు సేవ చేస్తే ఆ నాయకులను ప్రజలు ఆదరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో, రామక్కపేట రవీందర్ రెడ్డి, రాజశేఖర్, బి సురేందర్ రెడ్డి, ఉప్పు లోని కృష్ణ చారి, శ్రీకాంత్ గౌడ్, బాల్ రెడ్డి, జలీల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఈఎంఆర్ఎస్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

**కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహణ**

**- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రజిత**



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో పీ హెచ్ సీ డాక్టర్ సారియా అంజుమ్, ఆర్బీఎస్ కే వైద్య సిబ్బంది ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాలలోని ఏకలవ్య గురుకుల మోడల్ రెసిడెన్షియల్ (ఈఎంఆర్ఎస్)లో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించిన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనుమానితులకు రక్త పరీక్షలు చేశారు. పలువురు విద్యార్థులకు జలుబు, దగ్గు సమస్యలు ఉన్నాయని పీ హెచ్ సీ డాక్టర్ సారియా అంజుమ్ నిర్ధారించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రంగా కడుక్కొని వేడివేడి ఆహారాన్ని తినాలని సూచించారు. విద్యాలయం ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సిబ్బందికి సూచించినారు. ఏకలవ్య గురుకుల పాఠశాలలో కలుషిత హారంతో కూడిన జ్వరాలు లేవని డాక్టర్ స్పష్టం చేశారు.

## అత్యవసర వినియోగానికి ఎరువుల గోదాం ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో**

**అపెరల్ పార్కులో అందుబాటులోకి**

**జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు**

**ప్రారంభించిన కలెక్టర్, సిరిసిల్ల ఏ.ఎం.సీ చైర్ పర్సన్, డీఏఓ**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) అత్యవసర సమయంలో వినియోగించేందుకు ఎరువుల గోదాంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్కులో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఎరువుల గోదాంను ఏర్పాటు చేయగా, శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలో ఎప్పుడైనా ఎక్కడైనా అత్యవసర పరిస్థితిలో ఎరువులు కొరత ఏర్పడినప్పుడు అందజేసేందుకు ముందస్తుగా ఎరువుల గోదాం ఏర్పాటు చేసినట్లు వివరించారు. 100 మెట్రిక్ టన్నుల ఎరువులు బఫర్ లో అందుబాటులో పెడతామని తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం మాట్లాడారు. జిల్లాకు అవసరమైన ఎరువులు గతంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి మాత్రమే జిల్లాకు తెప్పిస్తున్నామని తెలిపారు. అత్యవసర సమయంలో ఎరువులు కావాల్సివస్తే ఇబ్బందులు ఎదురయ్యేవని గుర్తు చేశారు. ఈ ఇబ్బందులు అన్ని దూరం చేసేందుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవతో అపెరల్ పార్కులో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఎరువుల గోదాంను ఏర్పాటు చేయించారని వెల్లడించారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

# హీరోగా ఎంట్రీ ఇవ్వనున్న స్టార్ దర్శకుడి కొడుకు



హీరో లేదా దర్శకుడు లేదా నిర్మాత.. ఇలా ఎవ్వరైనా సరే ఇండస్ట్రీలో మంచి పేరు సంపాదించారంటే వాళ్ల పిల్లలు కూడా సినిమాల్లోకి రావాల్సిందే. ఒకప్పుడు తమ పిల్లల్ని సినిమాల్లోకి తేవాలా వద్దా.. ప్రేక్షకులు ఆమోదిస్తారా లేదా అని కొంచెం సంకోచించేవారు కానీ.. ఇప్పుడు అలాంటిదేమీ లేదు. అన్ని క్రాఫ్ట్స్ వాళ్లూ వారసులను సినీ రంగంలోకి తెచ్చేస్తున్నారు. అమ్మాయిలు సైతం ఈజీగా సినిమాల్లోకి వచ్చేస్తున్నారు. ఇక అబ్బాయిలు అయితే హీరోలు అయిపోవాల్సిందే. కోలీవుడ్ లెజెండరీ డైరెక్టర్లలో ఒకరైన శంకర్ ఇప్పటికే తన కూతురు అదితిని హీరోయిన్ని చేశారు.ఆ అమ్మాయి తమిళంలో కథానాయికగా మంచి పేరే సంపాదించింది. కొన్ని హిట్లు కూడా ఖాతాలో వేసుకుంది. ఈ మధ్యే 'భైరవం' సినిమాతో టాలీవుడ్లోకి కూడా అడుగు పెట్టింది. ఐతే శంకర్‌కు ఓ కొడుకు కూడా ఉన్న సంగతి సామాన్య జనానికి పెద్దగా తెలియదు. ఇప్పుడు అతను కూడా హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. తన పేరు అర్జిత్ శంకర్.అర్జిత్ ఇప్పటికే సినీ రంగంలోకి అడుగు పెట్టాడు. సీనియర్ దర్శకుడు మురుగదాస్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. ఆ సంగతి తెలిసిన వాళ్లు అతను తండ్రి బాటలో దర్శకుడు అవుతాడేమో అనుకున్నారు. కానీ సినిమాకు సంబంధించి అన్ని విషయాలూ తెలుసుకోవడం కోసమే అతను ఏడీగా పని చేశాడు. తన లక్ష్యం హీరో కావడమేనట. ముందు ప్రభుదేవా దర్శకత్వంలో అర్జిత్ ఎంట్రీ అని వార్తలు వచ్చాయి కానీ.. అది నిజం కాదట. స్టార్ డైరెక్టర్ అట్లీ దగ్గర పని చేసిన ఓ కొత్త దర్శకుడితో అర్జిత్ జట్టు కట్టబోతున్నాడట.


# గొడవ తప్పదని తెలిసినా..



బాలీవుడ్లో మోస్ట్ కాంట్రవర్శల్ డైరెక్టర్లలో వివేక్ రంజన్ అగ్నిహోత్రి ఒకరు. కొన్నేళ్ల ముందు వరకు ఈ దర్శకుడికి పెద్దగా పేరు లేదు. ఐతే 2022లో 'కశ్మీర్ ఫైల్స్' అనే సినిమా తీసి సంచలనం రేపాడు. కశ్మీర్ పండిట్ల ఊచకోత నేపథ్యంలో సాగే ఈ సినిమా తీవ్ర వివాదం రేపింది. అదే సమయంలో బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాన్నందుకుంది. కొందరు కశ్మీర్ పండిట్ల దీన గాథలను అద్భుతంగా చూపించారంటూ వివేక్ మీద ప్రశంసలు కురిపిస్తే.. ముస్లింల మీద ద్వేషాన్ని పెంచేలా తీసిన ప్రాపగండా మూవీ ఇదంటూ ఈ చిత్రాన్ని దుయ్యబట్టారు. వివేక్ విమర్శలను పట్టించుకోకుండా ఈ సక్సెస్‌ను మాత్రమే తీసుకుని.. ఆ తర్వాత కూడా ఈ తరహా సినిమాలే తీయడంలో నిమగ్నమయ్యాడు. 'వ్యాక్సిన్ వార్' సినిమా వివేక్‌కు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోగా.. ఇప్పుడు 'బెంగాల్ ఫైల్స్' మూవీతో రెడీ అయ్యాడు. 1947లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన మతపరమైన దాడుల నేపథ్యంలో సాగే సినిమా ఇది. దీని టీజర్ లాంచ్ కాగానే దుమారం రేగింది. బెంగాల్‌కు చెందిన అనేకమంది రాజకీయ నాయకులు వివేక్ మీద విరుచుకుపడ్డారు. ముఖ్యంగా అధికార టీఎంసీ పార్టీ వాళ్లు వివేక్‌ను టార్గెట్ చేశారు. ఇక్కడ మత కలహాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడంటూ ఆ రాష్ట్రంలో పదుల సంఖ్యలో వివేక్ మీద కేసులు నమోదయ్యాయి. ఈ సినిమాను తమ రాష్ట్రంలో రిలీజ్ చేయనివ్వమని.. వివేక్ ఇక్కడికి వస్తే అతడి అంతు చూస్తామని వార్నింగ్‌లు ఇచ్చారు. ఐతే ఇంత వివాదం చెలరేగాక.. తాను పశ్చిమ బెంగాల్‌ను బెంగాల్‌కు వెళ్తే తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతాయని తెలిసి కూడా వివేక్ అగ్నిహోత్రి పెద్ద స్టేట్మెంట్ ఇచ్చాడు. పశ్చిమ బెంగాల్‌లోనే 'బెంగాల్ ఫైల్స్' ట్రైలర్ లాంచ్ చేస్తానని.. అక్కడ తనను ఎవరు ఆపుతారో చూస్తానని వివేక్ అన్నాడు. అంతే కాక 'బెంగాల్ ఫైల్స్' సినిమాను బెంగాల్‌లో రిలీజ్ చేసి తీరుతానని కూడా ఆయన తేల్చి చెప్పారు.

ఈ వారం విడుదల కాబోతున్న కొత్త సినిమాల కన్నా రీ రిలీజ్ అవుతున్న అతడుదే డామినేషన్ అయ్యేలా ఉంది. కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రమ్ సో'ని మైత్రి తీసుకొస్తున్నా జనాలకు రీచ్ అవుతున్న దాఖలాలు పెద్దగా లేవు. మౌత్ టాక్ కనక వేగంగా స్ప్రెడ్ అయితే మంచి వసూళ్లు కళ్లజూడవచ్చు. మంజుమ్మల్ బాయ్స్ తరహాలో తమకు సర్ప్రైజ్ హిట్ అవుతుందనే నమ్మకం మైత్రి టీమ్ లో ఉంది. నిన్న రాజ్ బి శెట్టితో పాటు టీమ్ మొత్తాన్ని తీసుకొచ్చి ఈవెంట్ చేయడం సోషల్ మీడియాలో కొంత బజ్ తీసుకొచ్చింది. ఇక అతడు విషయానికి వస్తే రెండు రోజుల ముందే అడ్వాన్స్ బుకింగ్ లో రెండు కోట్ల దాకా గ్రాస్ వచ్చేసింది. ఆగస్ట్ 9 మహేష్ బాబు పుట్టినరోజు కాబట్టి దాన్ని పెద్ద ఎత్తున అతడుతో సెలెబ్రేట్ చేద్దామని ప్లాన్ చేసుకున్న ఫ్యాన్స్ కి పలు బ్రేకులు పడుతున్నాయి. మొదటిది కింగ్డమ్ ఫలితంతో సంబంధం లేకుండా వార్ 2 వచ్చే దాకా కొనసాగేలా మెయిన్ థియేటర్లతో అగ్రిమెంట్లు చేసుకుంది. ఇంకోవైపు మహావీర్ నరసింహ తగ్గేదేలే తరహాలో బుక్ మై షోలో రోజుకు కనీసం లక్షన్నర టికెట్లు అమ్ముతోంది. అతడు కోసం దీన్ని తీసేంత సీన్ ఎంత మాత్రం లేదు. వచ్చే వారం కూలి, వార్ 2 కేవలం అయిదు రోజుల గ్యాప్ లో వస్తున్నాయి. సో అతడు ఎంత రాబట్టుకున్న ఈ లోపే పూర్తి చేయాలి. అందుకే రికార్డులు అనుమానంగానే ఉన్నాయి. ట్రేడ్ టాక్ ప్రకారం అతడు రీ రిలీజ్ హక్కులు మూడున్నర కోట్లకు తీసుకున్నారట. అది కూడా కేవలం ఎడాది కాలానికి మాత్రమే. ఇది రికవర్ కావాలంటే పది కోట్ల గ్రాస్ ని టచ్ చేయాల్సి ఉంటుంది. ఇది కొంచెం టఫ్ గానే ఉంది.

## అతడు ముందు పెద్ద టార్గెట్ ఉంది





# తమన్నాకు సారీ చెప్పిన స్టార్

కేవలం 15 ఏళ్లకే కథానాయికగా అరంగేట్రం చేసి.. టీనేజీలోనే పెద్ద స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది తమన్నా. రెండు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్లో ఇటు దక్షిణాదిన.. అటు బాలీవుడ్లో ఆమె భారీ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించింది. గత కొన్నేళ్లలో కథానాయికగా అవకాశాలు తగ్గినప్పటికీ.. ఐటెం సాంగ్స్‌లో మెరుస్తూ, వెబ్ సిరీస్‌ల్లో నటిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్న తమ్మూ.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభంలో ఎదురైన ఓ చేదు అనుభవం గురించి పంచుకుంది. ఒక సౌత్ బిగ్ స్టార్ తన మీద సెట్స్‌లో అందరి ముందు కేకలు వేశారని.. ఆ తర్వాత తనకు సారీ చెప్పారని ఆమె వెల్లడించంది.ఆ స్టార్ ఎవరన్నది చెప్పలేదు కానీ.. ఆ హీరో టాలీవుడ్‌కు చెందిన వాడే అయ్యుంటాడనే చర్చ జరుగుతోంది. ఇంతకీ ఆ అనుభవం గురించి తమన్నా ఏం చెప్పిందంటే?“నేను చాలా చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి వచ్చేశాను. దీంతో నాకు పెద్దగా ఏమీ తెలియదని అనుకునేవాళ్లు. నా కాన్ఫిడెన్స్‌ను దెబ్బ తీయాలని చూసేవారు. నన్ను అవమానించడానికి ప్రయత్నించారు. ఐతే ఇండస్ట్రీలోకి వచ్చిన కొంత కాలానికే నాకు ఓ పెద్ద హీరో సినిమాలో నటించే అవకాశం దక్కింది. కానీ ఆయనతో కొన్ని సీన్లు చేసేటపుడు ఇబ్బందిగా అనిపించేది. ఆ విషయాన్ని దర్శక నిర్మాతలకు కూడా చెప్పాను. ఆ సీన్లు నా వల్ల కాదన్నాను. అప్పుడు ఆ హీరో హీరోయిన్ని మార్చమంటూ నాపై కేకలు వేశాడు. సెట్లో అందరి ముందూ ఆయన అరిచాడు. ఐతే ఒకరు మన పట్ల అవమానకరంగా ప్రవర్తించినా.. తిరిగి మనం అలా చేయకూడదని సైలెంట్‌గా ఉన్నా. ఐతే తర్వాతి రోజు ఆ హీరో తనంతటే తనే నా దగ్గరికి వచ్చి సారీ చెప్పాడు. కోపంలో అరిచానని.. నాతో అలా ప్రవర్తించి ఉండకూడదని పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. దీంతో ఆ గొడవ సమసిపోయింది” అని తమన్నా వివరించింది.

## నాకు అవకాశం వస్తే.. కచ్చితంగా అకీరాతో సినిమా చేస్తాను

పవన్‌కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ సినిమా ఎంట్రీ కోసం ఫ్యాన్స్ ఎప్పటినుంచో ఎధురు చూస్తున్నారు. అతడిని పరిచయం చేసేందుకు కొందరు డైరెక్టర్లు, నిర్మాతలు కూడా సిద్ధంగా ఉన్నారు. అలాంటి అవకాశం వస్తే తాను కూడా వదులుకోనని నిర్మాత టిజి విశ్వప్రసాద్ అన్నారు. ప్రస్తుతం ఆయన 'ది రాజాసాబ్' చిత్ర షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా విశ్వప్రసాద్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల వచ్చిన 'హరిహర వీరమల్లు' చిత్రం కోసం విశ్వ ప్రసాద్ సహాయం చేశారు. దీంతో అకీరాతో సినిమా కోసమే సహాయం చేశారని వార్తలు వచ్చాయి. ఈ విషయంపై ఆయన క్లారిటీ ఇచ్చారు. “అకీరాతో సినిమా చేయాలని చేయాలని అందరు నిర్మాతలకు ఉంటుంది. నాకు అవకాశం వస్తే నేను కచ్చితంగా చేస్తాను. అయిన ఎవరితో సినిమా చేయాలని అకీరానే నిర్ణయం తీసుకుంటాడు. ఆ విషయంలో వచ్చే వార్తలు చాలానే ఉన్నాయి. నేను హరిహర వీరమల్లుకు సాయం చేయలేదు. నిర్మాత ఎఎం రత్నంకి అవసరం ఉందని చేశాను. ఆ సమయంలో నన్ను చూసిన పవన్.. వీరమల్లు ప్రీ రిలీజ్ వేడుకలలో నాకు థ్యాంక్స్ చెప్పారు. అంతేకానీ, అకీరా సినిమా కోసం సామం చేశానన్న మాట అవాస్తవం” అని విశ్వప్రసాద్ వెల్లడించారు.



## జైన రమేష్ కి గౌరవ డాక్టరేట్ ప్రధానం



జనగామ(ప్రశ్న న్యూస్) జైన రమేష్ పలు స్వచ్ఛంద సేవ సంస్థలలో సభ్యత్వాన్ని కలిగివుంటూ, వాటి ద్వారా చేసిన ఎన్నో సేవా కార్యక్రమాలను గుర్తించిన గుడ్ న్యూస్, డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ న్యూయార్క్ టెక్సాస్ అనుబంధ సంస్థ గాడ్ సన్ హెూలీ థియలాజికల్ యూనివర్సిటీ వారు ' ఎడ్యుకేషన్ సోషల్ సర్వీస్' కేటగిరి నందు గౌరవ డాక్టరేట్ కు జూన్ నెలలో ఎంపిక చేసిన విషయం విదితమే ఈ అవార్డును ఈ రోజున హైదరాబాద్ నందు ప్రఖ్యాత వేడుకల మందిరంలో సినిమా %ఒ% టీవీ ప్రముఖులు అయిన సంధ్యా జనక్, జబర్దస్త్ నటుడు అప్పారావు, రాజేందర్, మేకల శివ కుమార్, డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ పెద్దలు చైర్మన్ డాక్టర్ డానియల్ కార్తికేయన్, అధ్యక్షులు డాక్టర్ అడ్రైన్ నజేరా చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జైన రమేష్ మాట్లాడుతూ "ఈ గౌరవ డాక్టరేట్ పొందినందుకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉంది. ఈ అవార్డు నాపై మరింత బాధ్యతను పెంచింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్నీ చేయడానికి ప్రోత్సాహంగా ఉంటుంది.ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా ఈ అవార్డు రావడానికి సహాయపడిన ప్రతి ఒక్కరికీ, నన్ను ప్రోత్సహించిన పెద్దలకీ, నా మిత్రులకీ, నా కుటుంబ సభ్యులకీ, నా లయన్ సభ్యులకీ, నా ఆర్యవైశ్య బంధువులకీ, అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు వారు తెలియజేశారు.

## రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గ్రామం యూనిట్గా వార్డుల వారీగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ తయారు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) పంచాయతీల్లో ఓటరు జాబితా తయారీ మ్యాపింగ్ లో భాగంగా హవేలీ ఘన్పూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. వార్డులు వారీగా ఓటర్స్ మ్యాపింగ్ విధానాన్ని సంబంధిత జడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి పరిశీలించి ఇతర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రామపంచాయతీ ఓటర్ నమోదు మ్యాపింగ్ ప్రక్రియ. ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ సెక్రెటరీ, కంప్యూటర్ ఆపరేటర్స్ తో పగడ్బందీగా కొనసాగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, బీఎలో ్వలు రూపొందించిన ఓటర్ల జాబితాను టీపోల్ యాప్లో నమోదు చేసేందుకు ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఒక లాగిన్ ఐడీ, పాస్వర్డ్నూ అందించారన్నారు.కొత్తగా ఏర్పడిన ఒక్కో పంచాయతీలో ఆరు వార్డులకు తగ్గకుండా ఓటర్లను విభజించాలని అందులోనూ ఒక కుటుంబం ఒక వార్డులోనే ఉండేలా నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య ఎంపీడీవోలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించొద్దు,

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఎరువులు కుత్రిమ కొరత సృష్టించచద్దనిడిమాండ్కు అనుగుణంగా నిలువలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ . రాహుల్ రాజ్ స్పష్టం చేశారు.శుక్రవారం మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఆగ్రో రైతు సేవా కేంద్రం ను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు డిమాండ్కు అనుగుణంగా ఉన్న నిలువలను పరిశీలించారు, స్టాక్ వివరాలను, ఆన్లైన్ తదితర వివరాలను డీలర్లు అడిగి తెలుసుకున్నారు, ప్రస్తుత సీజన్కు అనుగుణంగా జిల్లాలో తగినన్ని ఎరువులు విత్తనాలు ఉన్నాయని కొంతమంది కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు, రైతులతో స్వయంగా మాట్లాడుతూ వారికి కావలసిన సమాచారాన్ని అందించారు రైతులు జిల్లాలో ముందస్తుగా ఎరువులు విత్తనాలు యూరియా డిఏపి తదితర ఫర్టిలైజర్స్ లో వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచుకోవడం జరిగిందని తెలిపారు, కల్తీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన, ప్రభుత్వం సూచించిన ప్రకారం సంబంధిత వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్రమం తప్పకుండా సంబంధిత అధికారులతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించిన దమ్మన్నపేట్ మహిళలు



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో శ్రావణమాస శుక్లపక్షంలో అమ్మవారి వ్రతం సందర్భంగా ముదిరాజ్ పెద్దమ్మతల్లి ఆలయంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో మహిళలందరూ ప్రత్యేక పూజలు, కుంకుమ అర్చన నిర్వహించారు. శ్రావణమాస శుక్రవారం శుక్ల పక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నపేట ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామస్తులు ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లోనే కాదు చట్టసభల్లో కూడా కల్పించాలి.

**మంథని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికార్ కిషన్**



పెద్దపల్లి ( ప్రశ్న న్యూస్) మంథనిబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లోనే కాదు చట్టసభల్లో కూడా కల్పించాలని మంథని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికార్ కిషన్ జి డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపిస్తే ఇప్పటికీ కేంద్రం ఉలుకు పలుకు లేకుండా ఉండడం సూచనీయమని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ కు, రాష్ట్రపతికి పంపించిన దీనిపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. అందువల్లే తెలంగాణ కు చెందిన ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు ఢిల్లీలో ధర్నా చేసిన కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం, రాష్ట్రపతి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం యావత్తు తెలంగాణ సమాజాన్ని అవమానించినట్టుగానే భావించాలన్నారు. శాసనసభ ఏకగ్రీవ తీర్మానంలో పాలుపంచుకున్న బిఆర్ఎస్, బిజెపిలు ఢిల్లీలో చేసిన ధర్నాకు రాకపోగా అవహేళనగా మాట్లాడడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగంలో కల్పించడంలో టిఆర్ఎస్కు చిత్తశుద్ధి లేదన్నారు. మంథని నియోజకవర్గంలో బీసీ నినాదం ఎత్తుకున్న బిఆర్ఎస్ నాయకులు మీ వైఖరి స్పష్టం చేయాలన్నారు. మీ నాయకత్వం మీద ఒత్తిడి తెచ్చి ఢిల్లీ లో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. బిజెపి ముస్లింలను బీసీల్లో చేర్చినట్టు కుంటి సాకులు చెబుతున్న మీరు గుజరాత్ లో, ఉత్తరప్రదేశ్ మొదలగు రాష్ట్రాల్లో ముస్లింలో ఉన్న బీసీలను గుర్తించి రిజర్వేషన్లు కల్పించలేదా అని ప్రశ్నించారు. బిజెపి ద్వందనీతిని ఖండించి బిసి రిజర్వేషన్లు 42 శాతం కోసం పార్టీలకు అతీతంగా బీసీలు అంతా ఏకమై పోరాడేందుకు సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికార్ కిషన్ జి అన్నారు

## మెదక్ జిల్లా ఆడపడుచులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**యూత్ ఐకాన్ భవన్ కుమార్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) పవిత్రమైన రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ వాసులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను .ఈ పండుగ అక్కచెల్లెళ్ళు మరియు అన్నాచెల్లెళ్ళ మధ్య అనుబంధాన్ని, రక్షణను, ప్రేమను ప్రతిబింబిస్తుంది. ఈ పర్వదినం ప్రతి కుటుంబానికీ సంతోషం, ఐక్యత, ఆనందం తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. సమాజంలో బంధాలు బలపడేలా చేసే ఈ పండుగను శాంతియుతంగా, ఆనందంగా జరుపుకుందాం. రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తున్న యూత్ ఐకాన్ లీడర్ భువన్ కుమార్.

## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు రక్షాబంధన్



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని వివిధ పాఠశాలల్లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందు పిల్లలకు రక్షాబంధన్ ప్రాముఖ్యత,హిందూ సంస్కృతి - సంప్రదాయాల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం "నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష, మన ఇద్దరం దేశానికి రక్ష" అనే సంకల్పంతో రక్షాబంధన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిషోర్ రావు, అర్జున్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



సిరికొండ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని గోప్యానాయక్ తాండ శివారులో ఉన్న చంద్రు మహారాజ్ ఆలయం సమీపంలో బి టి రోడ్ పై నుండి గడ్డమీది తాండ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రెండు ట్రాక్టర్లలో తరలిస్తుండగా వారిని పట్టుకుని అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్కు తరలించబడినది. వాటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సిరికొండ ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్ష బంధన్ వేడుకలు

**- సోదరభావంతో సమాజం ముందుకు సాగాలి**

**- స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి : మల్లారపు ప్రశాంత్**




వేములవాడ (ప్రశ్న న్యూస్) భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల గర్ల్స్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడలో రక్ష బంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ సోదరి - సోదర భావనతో మెలగాలి. మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్న ఈ పరిస్థితిలో సమాజం ఐక్యంగా ముందుకు సాగాలి. అన్నయ్య - చెల్లెమ్మల మధ్య ఉన్న పరస్పర రక్షణ భావన దేశమంతటా వ్యాప్తి చెందాలి" అన్నారు. ప్రశాంత్ ఈ సందర్భంగా ప్రభుత్వాలను కూడా మహిళల రక్షణలో విఫలమయ్యాయని విమర్శించారు. మహిళల భద్రత కోసం దేశవ్యాప్తంగా మరిన్ని ప్రత్యేక చట్టాలను రూపొందించి, కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంజన,వేములవాడ డివిజన్ అధ్యక్షుడు సాయి భరత్, కార్యదర్శి శివ,నాయకులు భరత్,లక్ష్మణ్,అఖిల, మానస, అక్షయ,ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు

**సనాతన ధర్మాలకు సాంప్రదాయాలకు శ్రావణమాసం,**

**పుట్టినిల్లుగా అత్యంత పవిత్రమైనది వరలక్ష్మి శుక్రవారం**

**- అందంగా అలంకరించిన అమ్మవారి దేవాలయం**



మంథని ప్రతినిధి (ప్రశ్న న్యూస్) శ్రావణ మాసంలో అత్యంత పవిత్రమైన రోజు శ్రావణ శుక్రవారం. మంథని పట్టణంలోని ఎంతో మహిమాన్వితం కలిగిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో



ఉదయం 3 గంటలకు అమ్మవారి మూల విగ్రహమునకు ఫల పంచామృతాలతో అభిషేకం చేయించే కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే శ్రీ చక్రమునకు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. సహస్రనామ త్రిషది నామ ఖడ్గనామ, కుంకుమార్చన అనంతరం హారతి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 9:30 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన అలాగే సాయంత్రం 5 గంటలకు సామూహిక లలిత సహస్రనామ పారాయణము, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం తొమ్మిది గంటలకు పూజా కార్యక్రమం నిర్వహించి తలయింపు సేవతో వరలక్ష్మి శుక్రవారం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ తెలిపారు. అమ్మవారి దయ ఉంటే అన్ని అన్నీ ఉన్నట్లే అని ఆయన తెలిపారు. అనాదిగా ఎంతో విశిష్టత కలిగిన అమ్మవారిని దర్శించుకోవడానికి ఉదయం 5 గంటల నుండి భక్తుల సందడి మొదలవుతుంది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి రావడంతో ఆలయంలో పండుగ వాతావరణ నెలకొంది. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం ముందు ఉన్న పోచమ్మ తల్లి ఆలయం కూడా భక్తులతో కిటకిటలాడింది. అందుకు తగిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

## గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికార దుర్వినియోగాలకు బండి సంజయ్ ధీటు

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- ఫోన్ ట్యాపింగ్ కేసులో బండి సంజయ్కు వేములవాడ పట్టణ భాజపా నేతల మద్దతు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిట్ విచారణకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ,కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధారాలతో శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ బీజేపీ నేతలు ఆయనకు సంఘీభావం ప్రకటించారు.భాజపా వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ చేరుకొని బండి సంజయ్కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పక్కనబెట్టి ఫోన్ ట్యాపింగ్ వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిందని,నిజం వెలుగులోకి తెచ్చే పోరాటంలో బండి సంజయ్ ముందంజలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# రూటు మార్చిన రేవంత్

## - ఢిల్లీ కేంద్రంగా కీలక నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సీఎం రేవంత్ రూటు మార్చారు. ఢిల్లీ కేంద్రంగా తన సత్తా చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అటు వరుస విచారణల తో బీఆర్ఎస్ నేతలు ఇరకాటంలో ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో బీజేపీని టార్గెట్ చేస్తున్నారు. ఈ సమయంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్ల అమలు అంశంలో రేవంత్ కొత్త వ్యూహాల అమలుకు సిద్ధమయ్యారు.

### రేవంత్ కార్యాచరణ

ముఖ్యమంత్రి రేవంత్ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ అంశం తోనే ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తున్నారు. అటు వరుస విచారణలతో బీఆర్ఎస్ నాయకత్వం ఆత్మరక్షణలో పడింది. బీసీ రిజర్వేషన్ల అంశం పైన బీఆర్ఎస్ తమ వ్యూహాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇదే సమయంలో ఢిల్లీ కేంద్రంగా రేవంత్ కొత్త ఆలోచనల ను తెర మీదకు తెస్తున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని రేవంత్ స్పష్టం చేశారు. బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుందని రేవంత్ స్పష్టం చేశారు.

### - కొత్త ఆలోచనలు

42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించామన్న రేవంత్ రెడ్డి కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు తమ వద్ద 3 మార్గాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 50 శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలని అన్నారు. జీవో ఇస్తే ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తే స్టే వస్తుందని, జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదని ఆయన వివరించారు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గమని రేవంత్ చెప్పారు. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయన్నారు. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు నష్టపోతాయని చెప్పుకొచ్చారు.

### - ముందుకే వెళ్తాం

ఇక, మూడో మార్గం గురించి ఆసక్తి కర విశ్లేషణ చేసారు. మూడవ మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వడమని రేవంత్ అన్నారు. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తామని ఆయన వెల్లడించారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నారనే ఆలోచనతోనే అడ్డుకుంటామని కిషన్‌రెడ్డి ఉన్నారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బీసీలకు అండగా ఉండాలని బీఆర్ఎస్ నేతలు అనుకోవట్లేదని సీఎం విమర్శించారు. బీసీ బిల్లులను, ఆర్డినెన్స్?ను వెంటనే ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం తలచుకుంటే రెండ్రోజుల్లోనే చట్టం ఆమోదం పొందుతుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు మా విధానం బీజేపీ విధానం ఏమిటో చెప్పాలని రేవంత్ డిమాండ్ చేసారు. అసెంబ్లీ సమావేశాల వేదికగా తమ నిర్ణయం వెల్లడించేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది.

# నాన్నకు ప్రేమతో కన్నీటి లేఖ

# నాన్నా నిన్ను చివరిచూపు చూస్తానా.?

## -మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డి కూతురు స్నేహలత

మంథని ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మంథని మండలం శాస్త్రులపల్లి వాస్తవ్యులు భారత కమ్యూనిస్టు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పోలీట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి కూతురు స్నేహలత రాసిన లేఖ శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నేను క్షేమం... యుద్ధంలో ఉన్న నీ క్షేమాన్ని కోరటం అత్యాశే అవుతుంది. నిన్ను చూసే, నీతో మనసారా మాట్లాడే అవకాశం నాకెలాగూ లేదు. కనీసం నిన్ను చివరిచూపు చూస్తానో లేదోనన్ ఆందోళనతో... ఈ బహిరంగలేఖ రాస్తున్నాను. మొన్న నంబాల కేశవరావు అంకుల్‌ను అనాథగా దహనం చేసిన తర్వాత కనీసం నీ పార్థివదేహాన్ని చూడగలననే ఆశ కూడా కోల్పోయాను. నీతో ఇలా సంభాషించవలసి రావటమే అతి పెద్ద విషాదం. గత సంవత్సరం జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో నీవే మరణించావని వార్త పొక్కింది. అది నిజమో, కాదో తేల్చుకోలేక వారం పాటు బాధాతప్త హృదయంతో ఉండిపోయాం. ఎన్‌కౌంటర్ వార్త విన్నప్పుడల్లా మా ఇద్దరు పిల్లలు 'తాత ఎలా ఉంటాడమ్మా' అని అడుగుతున్నారు. సరిగ్గా నలభై ఏళ్ల కిందట 'నాన్న ఎలా ఉంటాడమ్మా' అని నేను మా అమ్మని అడిగిన రోజులు నా స్మృతిపథంలోకి వచ్చాయి. కాలం చూడు ఎలా గడిచిపోయిందో. నీవు అజ్ఞాతంలోకి వెళ్లి యాభై ఏళ్లు గడిచాయి. మొన్న ఎవరో అంటే విన్నాను నీవు, మల్లోజుల కోటేశ్వరరావు, గణపతి అంకుల్ మొదటితరం నాయకులని. మీ జీవితంలో మూడోవంతు ప్రజలకు అంకితం చేసారు. ఏ మనిషికైనా ఇలాంటి జీవితం అరుదుగా లభిస్తుంది. స్వాతంత్ర్య పోరాటంలో వీరుల గాథలను పుస్తకాలలో చదివాను. ఇప్పుడు స్వయంగా నా తండ్రే అలాంటి చరిత్రలో భాగమైనందుకు గర్వంగా ఉంది. నేను పుట్టేనాటికే నీవు విప్లవాన్ని ప్రేమించావని అమ్మ చెప్పింది. అంతకు మునుపే నీవు అమ్మను ప్రేమించావు. ఆమె నిన్ను, నీవు కోరుకున్న విప్లవాన్ని ప్రేమించి, పొత్తిళ్లలో ఉన్న నన్ను వదిలివేసి నీతో వచ్చింది. తల్లీ తండ్రీ ఉండి కూడా అనాథలా బతికాను. నిరాదరణ, ఈసడింపులు జీవితాన్ని వెక్కిరించాయి. దుఃఖం కట్టలు తెంచుకొని నిద్రలేని రాత్రులు నాతో సహవాసం చేశాయి. బంధువులకు భారమైనప్పుడల్లా నేను గూడులేని పక్షినే. ఆరేళ్ల వయసులో అనుకుంటాను నేనున్న చోటుకు సంవత్సరం తర్వాత ఒకరోజు అమ్మ వచ్చింది. నేను అమ్మను గుర్తుపట్టలేదు. యథాలాపంగా నా ఆటలో నేను మునిగిపోయాను. ఆమె నా దరి చేరి అక్కున చేర్చుకొని 'నేను మీ అమ్మనని' చెప్పింది. ఈ ప్రపంచంలో ఏ తల్లికి అలాంటి పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నాను. ఇక ఆ తర్వాత అమ్మ కూడా నా దగ్గరకు రావటం తగ్గిపోయింది. నేను అక్షరాలు నేర్చుకుంటున్న సమయంలోనే నా బాగోగులు చూసుకుంటున్న వారిని వదిలి మరో చోటుకు పంపించారు. హాయిగా అమ్మ ఒడిలో నిద్రించవలసిన వయసు, చందమామ కథలు వినవలసిన సమయం, గోరుముద్దలు తినవలసిన కాలంలో బతుకు చితికి, కన్నీళ్లు మింగాల్సివచ్చింది. బాలకార్మికురాలి పాత్రలోకి జీవితం తర్జుమా అయింది. ఉదయాన్నే నిద్రలేచి, నా వయసుకు తగని పనులు చేసి, అప్పటికే అలసిపోయి బడికి వెళ్లేదాన్ని. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర నాకు చాలా దూరంగా ఉండిపోయాయి. పారిపోవాలని ఉండేది కానీ గమ్యం తెలియదు. చనిపోవాలని అనిపించేది కానీ మార్గం తెలియదు. అప్పుడప్పుడు ఊళ్లోకి వచ్చే నీ సహచరులు కనుక్కునే యోగక్షేమాలే నాకు లభించే ఊరట. ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో డాక్టర్ కావాలని ఉండేది కానీ, నాకు సరైన దారి దొరకలేదు సరికదా దారిచూపేవాళ్లూ లేరు. అప్పుడనిపించింది. అందరిలాగా నాకు అమ్మానాన్న ఉంటే ఇష్టమైన చదువు దొరికేది కదా! అని. అంతిమంగా నావి అస్థిరమైన వానాకాలం చదువులయ్యాయి. నా ప్రమేయం లేకుండానే నేను ఉండే స్థలం, చదువు నిర్ణయం జరిగి మారుతుండేవి. అలా హైదరాబాద్ నగరానికి మారిపోయాను. లక్షలాది మంది అనాథలను, వలస కార్మికులను తన ఒడిలో చేర్చుకున్న ఈ నగరం నాకింత చోటిచ్చింది. కాస్త జీవితాన్నిచ్చింది. కొంత జ్ఞానానిచ్చింది. కొత్త స్నేహాలు, రాజకీయాలు, సామాజిక చలనాలు, ఆచరణ, అధ్యయనం నాకింత మనోధైర్యాన్ని ఇచ్చాయి. ప్రపంచం అర్థమయ్యేకొద్దీ సాంత్వన లభించింది. సరిగ్గా ఈ సమయంలోనే నా జీవితాన్ని అల్లకల్లోలం చేసిన పిడుగులాంటి వార్త విన్నాను. చంటి పిల్లగా నన్ను వదిలేసిపోయిన మా అమ్మ ఎన్‌కౌంటర్ అయింది (ఆగస్టు 13, 1998). అది జరిగిన నెల రోజులకు నాకు ఆ విషయం తెలిసింది. అనాథ శవంగా మా అమ్మ మిగిలిపోయింది. ఆమెను ఎవరో ఖననం చేసారు. పిచ్చిదానిలా హైదరాబాద్ రోడ్లు పట్టి తిరిగాను. రాత్రి, పగలని తేడా లేకుండా సంచరించాను. నిద్రాహారాలు మాని దుఃఖాన్ని ఆశ్రయించాను. ఒంటరిదాన్ని



అయిపోయాను. కనిపించని శత్రువుతో మౌనంగా యుద్ధం చేసాను. తండ్రి ఉండీ రాలేదు. తల్లి మరణించింది. ఈ జీవితం ఎందుకని ఎన్నిసార్లు అన్పించిందో! ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో సీటురావటం నా జీవితానికి చుక్కానిలా అన్పించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావటం వలన మామూలు మనిషిని కాగలిగాను. కానీ నేను పెళ్లి చేసుకున్న రోజు నీవు నా పక్కన ఉంటే ఎంత బాగుండునో కదా! నీ మనుమరాలు నా కడుపులో పడినప్పుడు ఈ వార్త నీతో చెప్పాలని ఎంత ఆశపడ్డానో. అందరు స్త్రీల వలె తల్లిదండ్రుల చేతుల మీదుగా నాకు సీమంతం జరగాలని ఎన్నిసార్లు అన్పించిందో. బాలింత వాసన తీరకముందే నా బిడ్డకు నేనే స్నానం చేయించుకోవలసి వచ్చింది. నీ చేతుల్లో ఆడుకోవాలని, నీ భుజాల మీద కూర్చోవాలని, నీ వేలు పట్టి నడవాలని ఎన్నోసార్లు కోరుకున్నాను. కనీసం నా పిల్లలన్నైనా నీవు ఎత్తుకుంటే చూసి మురిసిపోవాలని భావించాను. డియర్ నాన్న, నేను కోరుకున్నవేవీ జరగలేదు, జరుగుతాయనే నమ్మకం లేదు. కానీ నీవు, నీ సహచరులు క్షేమంగా ఉండాలని, నీకు ఏ ప్రమాదం జరగకూడదని బిడ్డగా నా కోరిక. నీవు కోరుకున్న పోరాటం జయాపజయాలతో నిమిత్తం లేకుండా, విరామమెరుగని నీ ప్రయాణంలో 'మా నాన్న హీరోనే'నని నా పిల్లలకు చెప్పే రోజొకటి ఉంటుందని మాత్రం చెప్పగలను. నీవు మల్ల రాజిరెడ్డివో, మీసాల రాజన్నవో, సాయన్నవో, సంగ్రాంవో, మురళివో నాకు తెలియదు. నాకు మాత్రం బాపువే... అంటూ స్నేహలత రాసిన లేఖ సంచలనం సృష్టించింది.

# ట్రాన్స్ఫార్మర్ పెట్టారు..కనెక్షన్ మరిచారు



మేడ్చల్( ప్రశ్న న్యూస్) ట్రాన్స్ఫార్మర్ పెట్టారు.. దానికి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. ఈ ఘటన గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు గోల్డెన్ ప్లాజా కాలనీలో లో చోటుచేసుకుంది. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ 11వ వార్డు పరిధిలో గల గోల్డెన్ ప్లాజా కాలనీలో విద్యుత్ లో వోల్టేజ్ కారణం చేత ఫీజులు పోవడం, కరెంటు పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొద్దిరోజుల నుంచి పరిస్థితి ఇదే విధంగా ఉండటం వల్ల అప్పటి మున్సిపల్ కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లగా మున్సిపల్ కౌన్సిలర్ కౌన్సిల్ లో ఈ విషయం చర్చించారు. గ్రామంలో చాలాచోట్ల లో వోల్టేజ్ సమస్య ఉందని, ఇతర కౌన్సిలర్లు కూడా మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని చైర్మన్ అప్పటి లైన్మెన్ ను మిగతా విద్యుత్ సిబ్బందిని పిలిచి వారితో చర్చించి విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అప్పటి ఏఈ వెంకట్ గౌడ్ ఎక్కడెక్కడ ఉందో అక్కడక్కడ కరెంటు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఇట్టి ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి తగిన స్థలం చూపెట్టాలని మున్సిపల్ చైర్మన్ ను కోరారు. వెంటనే మున్సిపల్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్లకు ఈ విషయాన్ని తెలియజేయగా కౌన్సిలర్లు ట్రాన్స్ఫార్మర్ దిమ్మెలు ఏర్పాటు చేయడానికి వారు స్థలాలను చూపెట్టడం జరిగింది. ఇట్టి దిమ్మలను కట్టి చాలా కాలం తర్వాత కొన్నిచోట్ల ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసి వాటికి కనెక్షన్లను ఇచ్చారు. కానీ గోల్డెన్ ప్లాజా అపార్ట్మెంట్ వెళ్లే దారిలో డిమ్మ నిర్మించి దాదాపు నాలుగు నెలలు అయింది. అట్టి కట్టిన దిమ్మ పైన ట్రాన్స్ఫారం పెట్టడానికి కూడా తిరిగి నాలుగు పైగా కాలం అయింది. ఇప్పుడు వర్షాకాలం ప్రారంభమైంది. ఇన్నిసార్లు విద్యుత్ అధికారులను ట్రాన్స్ఫార్మర్ కు లైన్ కలపమని కోరగా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండ పోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి ఈ ట్రాన్స్ఫార్మర్ నుండి కాలనీకి కనెక్షన్ ఇచ్చి కరెంట్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.. గతంలో పాలకవర్గం ఉన్నప్పుడు ప్రతి సమస్యను పరిష్కరించే వారని గత జనవరి నుండి పాలకవర్గం రద్దయినందున మా సమస్యలు పట్టించుకునే నాథుడె కరువయ్యారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా తక్షణం విద్యుత్ అధికారులు గానీ మున్సిపల్ కమిషనర్ గాని ఈ విషయంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆక్యుప్రెషర్ లో సింగిల్ పాయింట్ తో చికిత్స

## డాక్టర్ బసవరాజుతో మూడు రోజుల శిక్షణ తరగతులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బసవ అక్యూ అకాడమీ, వంశీ హోలీస్టిక్ గోల్డెన్ ఫ్యూచర్స్ గ్లోబల్ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రెడిషన్ ఎనర్జీ మెడిసిన్ శిక్షణ తరగతులను హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డా.బసవరాజ్ శిక్షణను ఇస్తూ మనలో ప్రతి ఒక్కరిలోనూ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అంతర్గత శక్తి



ఉందని ఈ శక్తిని ప్రేరేపిస్తూ మందుల అవసరం లేకుండా శరీరంలో అనారోగ్యాన్ని స్వయంగా నయం చేసుకునే మార్గాలను అవగాహన కల్పించేందుకు ట్రెడిషనల్ ఎనర్జీ మెడిసిన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆగస్టు 1 నుండి 4 వరకు నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి దాదాపు 100 మందికి పైగా ఆరోగ్య ప్రియులు హోలిస్టిక్ థెరపీ నేర్చుకోవడం జరిగిందని బసవరాజ్ ఆధ్వర్యంలో నాడీశ్వర డగ్నోసిస్, రంగుల వైద్యం, బయో ఎనర్జీ టెక్నిక్, ఆహార జీవనశైలి మార్గదర్శకాలను తెలిపారని అదేవిధంగా చెడు శక్తుల నివారణ, శరీర మనసు సంతులనం, ఆత్మీయ శుభ్రత అన్నిటిని సమగ్రంగా శిక్షణలో అందించారు. ఇలాంటి శిక్షణ తరగతులను నిర్వహించడంలో నిర్వాహకుడు వంశీకృష్ణ అన్నివేళలా ముందు ఉంటారని కొత్త తరహా వైద్య పద్ధతులను తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా శిక్షణా తరగతులను వంశీ హోలీ స్టిక్స్ అందిస్తుందని పూర్తి సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్ 9542702549, 7801027649

# ఆర్టీసీ ఐటీఐ కాలేజీలో అడ్మిషన్స్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్): ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు టీజీఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. హైదరాబాద్ హకీంపేట్‌లో ఉన్న ఆర్టీసీ ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. 8, 10 తరగతి విద్యార్హత కలిగిన వారు, మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్స్ లో కోర్సులు చేరవచ్చు. అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 28లోగా తమ వెబ్‌సైట్‌లో http://iti.telangana.gov.in అప్లయ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. వాక్ ఇన్ ఫేజ్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. విద్యార్థులు సమాచారం కోసం 9100664452, 6302649844, 040-69400000 ఫోన్ నంబర్లను సంప్రదించాలని టీజీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఒక ఏడాది కోర్సులు. మెకానిక్ (మోటర్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల డ్యూరేషన్ తో అందిస్తోంది ఆర్టీసీ. వెల్డర్, పెయింటర్ కోర్సులకు 8వ తరగతి విద్యార్హత. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజులు చెల్లించాలి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588